

అద్వితీయం.. నృత్యాభినయం

రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో ఆదివారం రాత్రి 'జుగల్‌బందీ' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో సౌరభ్‌చౌహాన్, లక్ష్మీదీపిక నృత్య ప్రదర్శన

-16లో

ఈనాడు
తూర్పుగోదావరి

సోమవారం 21 ఆగస్టు 2017 .. 16 పేజీలు

ప్రచారంలోనూ పోటాపోటీ

- ప్రధాన పార్టీల తరఫున రంగంలోకి దిగిన ముఖ్య నేతలు
- క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలను నియమించిన తెదేపా

ఈనాడు, కాకినాడ

కాకినాడ నగరపాలక ఎన్నికల ప్రచారానికి మరో వారం రోజులే మిగిలి ఉండడంతో అన్ని పార్టీల అభ్యర్థులు దూకుడు పెంచారు. ఆదివారం అభ్యర్థులు, నేతలు పోటాపోటీగా ప్రచారాన్ని నిర్వహించారు. తెదేపా తరఫున ఆ పార్టీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొనగా, వైకాపా అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ సీనియర్ నేతలు ప్రచారం చేశారు.

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రచారంలో పాల్గొన్నారు. వీరితో పాటు కాకినాడ ఎంపీ తోట నరసింహం, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గొల్లపల్లి సూర్యారావు, దాట్ల సుబ్బరాజు, గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కర రామారావు నివాసానికి వెళ్లి ఆయనతో సమావేశం అయ్యారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో భాస్కర రామారావును బుజ్జగించిన ప్రత్తిపాటి ఆయన కూడా ప్రచారంలో పాల్గొనేలా ఒప్పించారు. ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప 9, 4, 39 డివిజన్లలో పర్యటించారు. 3, 4, 5 డివిజన్లలో చినరాజప్పతో పాటు భాజపాకు చెందిన రాష్ట్ర మంత్రి మాణిక్యాలరావు తదితరులు పర్యటించారు. మంత్రి పుల్లారావు 10వ డివిజన్‌లో స్థానిక నేతలతో కలిసి ప్రచారం చేశారు. తెదేపాలో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కోసం జన్మభూమి, వార్డు కమిటీలతో పాటు ప్రతి వంద మంది ఓటర్లకు పది మంది సభ్యులతో పర్యవేక్షణకు నియమించారు. భాజపా పోటీ చేస్తున్న డివిజన్లలో ఆ పార్టీకి చెందిన మంత్రి మాణిక్యాలరావు, ఎమ్మెల్యేలు ప్రచారాన్ని నిర్వహించారు. వైకాపాలో (మిగతా 7లో)



9వ డివిజన్‌లో భాజపా అభ్యర్థి మాలకొండయ్య తరఫున మంత్రులు మాణిక్యాలరావు, చినరాజప్ప ప్రచారం



44వ డివిజన్‌లో ఫ్యాన్ గుర్తుతో వైకాపా కార్యకర్తల ప్రచారం

గుండెల్లో రెబెల్స్

- నగరపాలక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థుల హడావుడి
- ప్రధాన పార్టీలకు వణుకు పుట్టిస్తున్న వైనం
- పోటీ నుంచి విరమింపజేసేందుకు నేతల ప్రయత్నాలు

కాకినాడ, ఈనాడు: కాకినాడ నగరపాలక ఎన్నికల్లో ప్రధాన పార్టీల్లో రెబల్స్ బెడద అభ్యర్థులు, నేతలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఎన్నికల్లో తీవ్ర పోటీ నెలకొనడంతో రెబల్స్ వల్ల తమ విజయావకాశాలపై ప్రభావం పడుతుందేమోన్న ఆందోళన వారిని వెంటాడుతోంది. నగరపాలక సంస్థలో ఎన్నికలు జరుగుతున్న 48 డివిజన్లలో పలు చోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు అయిదారుగురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది ఆయా పార్టీల తరఫున టిక్కెట్లు ఆశించి రాకపోవడంతో రెబల్స్‌గా పోటీ చేస్తున్నారు. మొత్తం 121 మంది స్వతంత్ర అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా వీరు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో వీరి (మిగతా 7లో)



47వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి కొల్లాబత్తుల రాజ్యలక్ష్మి



చిన్నారుల కేరింత!

రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్ వద్ద నిర్వహించిన 'ఆనంద ఆదివారం'లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

3లో

అదిగదిగో నైపుణ్య నగరి


-మధ్యపేజీల్లో

పారిశ్రామిక ప్రోత్సాహం

- జిల్లాలో పలు సంస్థల స్థాపనకు ముందడుగు
- జేగురుపాడు, కోనసీమలో ఏర్పాటుకు ఆసక్తి

ఈనాడు, రాజమహేంద్రవరం

పారిశ్రామిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాల్లో తూర్పుగోదావరి దూసుకెళ్తోంది. స్థానికంగా రోడ్డు, రైలు, విమాన మార్గాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేసుకున్న పారిశ్రామిక ఒప్పందాలకు సంబంధించి అడుగులు వడివడిగా పడుతుండగా.. మరిన్ని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించేందుకు పలువురు ముందుకొస్తున్నట్లు పరిశ్రమల శాఖ అధికారులు చెబుతున్నారు. రెండు నెలల కిందట నిర్వహించిన పారిశ్రామిక దినోత్సవంలో 23 మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారు. సాధారణంగా పెద్ద తరహా పరిశ్రమలన్నీ మెట్ట ప్రాంతానికే పరిమితవుతున్న తరుణంలో ఈ దఫా జరిగిన ఒప్పందాలన్నీ రాజమహేంద్రవరానికి సమీపంలోని జేగురుపాడు, కోనసీమకు సంబంధించినవి కావడం గమనార్హం. ఒప్పందాల ప్రక్రియ ముగిసిన తరువాత వాటి ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటికే (మిగతా 7లో)



బస్సు యాత్రను జయప్రదం చేయండి

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన బాధితుల బస్సు యాత్ర ఈ నెల 23వ తేదీన రాజమహేంద్రవరం చేరుకుంటుందని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేదిలేదన్నారు. ఉద్యమంలో బాధితులు భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు శేషుకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఎన్ మూర్తి, సత్యనారాయణ, శ్రీహరి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా ప్రజావాణి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ కార్తికేయ మిశ్రా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి కోర్టు మందిరంలో వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

రహదారిపై కూలిన చెట్టు

రాకపోకలకు అంతరాయం

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం-రంపచోడవరం ప్రధాన రహదారిలో ఆదివారం తెల్లవారు జామున భారీ వృక్షం నేలకూలింది. దీనితో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రంపచోడవరం మండలం వెలమలకోటకు సమీపంలో రహదారికి అడ్డంగా చెట్టు పడటంతో ఉదయం 11 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. మారేడుమిల్లి వెళ్లే నర్సీపట్నం డిపో బస్‌ను గంగవరం నుంచి కొత్తపల్లి మీదుగా దారి మళ్లించారు. జేసీబీ సహాయంతో చెట్టును తొలగించిన తరువాత రాకపోకలు సాగాయి.



గంగవరం- రంపచోడవరం రహదారిలో కూలిన భారీ వృక్షం

CLASSIFIEDS

నెక్ కోడిగ్రుడ్ల ధర

★ తూర్పుగోదావరి జోన్
రైతు ధర రూ. 3-59 పైII

★ గోదావరి జోన్
రైతు ధర రూ. 3-59 పైII

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నేటి నుంచి కోస్తా క్లస్టరు స్థాయి అథ్లెటిక్స్, ఎగ్జిబిషన్

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయలో ఈ నెల 21, 22 తేదీల్లో కోస్తా జిల్లాల క్లస్టరు స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలతో పాటు, ఆరు సబ్జెక్టులలో ప్రదర్శన జరుగుతుందని నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ జి. మల్లికార్జునబాబు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలోని 9 విద్యాలయాలు నుంచి సుమారు 200 మంది విద్యార్థులు ఇందులో పాల్గొంటారన్నారు. అథ్లెటిక్స్‌లో గెలుపొందిన వారు ఈ నెల 26 నుంచి 28 వరకు నెల్లూరులో జరిగే హైదరాబాదు రీజియన్ పరిధిలో జరిగే పోటీలలో పాల్గొంటారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన వారు పాల్గొంటారన్నారు. ఆరు సబ్జెక్టులలో ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి గుంటూరులో ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే హైదరాబాదు రీజియన్ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు.

రిలయన్స్ పవర్ పరిశ్రమకు జాతీయ భద్రతా పురస్కారం

సామర్లకోట, న్యూస్‌టుడే : సామర్లకోటలో ఉన్న రిలయన్స్ పవర్ పరిశ్రమకు జాతీయ భద్రతా పురస్కారం దక్కింది. ఈ సందర్భంగా ముంబయి రిలయన్స్ పవర్ హోల్ టైమ్ డైరెక్టర్ ఎన్. వేణుగోపాలరావు పురస్కారం అందుకున్నారు. 2013 నుంచి 2015 సంవత్సరం వరకు సామర్లకోట రిలయన్స్ పవర్ పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు, నిబంధనలు పాటించడం వల్ల ఈ పురస్కారానికి ఎంపికైనట్లు వేణుగోపాలరావు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 17న దిల్లీలో జరిగిన భద్రతా దినోత్సవం కార్యక్రమంలో పురస్కారాన్ని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్, కేంద్ర కార్మిక శాఖా మంత్రి దత్తాత్రేయ నుంచి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సామర్లకోట రిలయన్స్ పవర్ లిమిటెడ్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.

నేడు కేవీకేలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు

రంపచోడవరం, న్యూస్‌టుడే: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే), డాక్టర్ వైఎస్సాఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో కేవీకే ప్రాంగణంలో సోమవారం జిల్లా స్థాయిలో రైతులకు అవగాహన కల్పించేందుకు 'నవభారత నిర్మాణం-2022 సంకల్పసిద్ధి' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎ.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి, ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో వ్యవసాయ పద్ధతులకు సంబంధించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

ముగిసిన కరాటే పోటీలు

వికాస్‌నగర్ (విశాఖ): వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న కరాటే పోటీలు ఆదివారం ముగిశాయి. కాటాస్, కుమిటి విభాగాల్లో 11 జిల్లాలకు చెందిన 300 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో తలపడ్డారు. ఓవరాల్ పాయింట్లలో విశాఖపట్నం జట్టు మొదటి స్థానంలో, తూర్పు గోదావరి జట్టు రెండో స్థానంలో, విజయనగరం జట్టు మూడో స్థానంలో నిలిశాయి. ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ మేయరు పులుసు జనార్ధనరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు.

ఎన్టీఆర్ గ్రామీణ్ పథకాన్ని వేగవంతం చేయాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ గ్రామీణ్ గృహనిర్మాణ పథకంలో మంజూరైన ఇళ్లను పూర్తిస్థాయిలో చేపట్టాలని సంయుక్త కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. ఆదివారం తన విడిది కార్యాలయంలో గృహనిర్మాణం, రెవెన్యూ, మండల ప్రత్యేక అధికారులతో సమావేశం నిర్వహించారు. 2016-17 సంవత్సరానికి సంబంధించి ఈ పథకం కింద 14,189 ఇళ్లు కేటాయించారని తెలిపారు. వీటి మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అమలాపురం డివిజన్‌లో ఇంకా చాలా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదన్నారు. ఈ డివిజన్‌లో ఇంకా 4,200 ఇళ్ల పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరులోగా ఈ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. రెవెన్యూ, గృహనిర్మాణం, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో వీటి పనులు త్వరగా చేపట్టేలా లబ్ధిదారులతో చర్చించాలని సూచించారు. వీటికి ఇసుకను సరఫరా చేయాలన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ నిర్దేశించిన ధరలకే అందుబాటులోకి తేవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో గణేశ్‌కుమార్, గృహనిర్మాణ సంస్థ జిల్లా పథక సంచాలకులు విశ్వేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో అగ్నిప్రమాదంపై ఫిర్యాదు

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఈనెల 18వ తేదీన రాజమహేంద్రవరం నగరపాలకసంస్థలో జరిగిన అగ్నిప్రమాదంపై కమిషనర్ విజయ్‌రామరాజు 3వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ రోజు తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదాన్ని ఉదయం 5.45 గంటల ప్రాంతంలో వాచ్‌మెన్ గమనించి సెక్యూరిటీ గార్డుకు సమాచారం అందించడంతో అతడు ఆర్యాపురం అగ్నిమాపక కార్యాలయంలో ఫిర్యాదు చేయగా వెంటనే సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారని, ఈ ప్రమాదంలో రూ.2.45 లక్షల విలువగల ఆస్తి నష్టం సంభవించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరిమార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూIIలలో)
కొత్తకొబ్బరి	8,600
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ:	
గండేరా	10,000
గటగట	6,000
కొత్తకాయ:	
గండేరా	9,500
గటగట	6,000
నీటికాయ(వెయ్యింటికి):	
పాత(ముక్కుడు)కాయ	7,000 -7,500
కొత్త(పచ్చి)కాయ	8,000-8,200
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలకు	2100
1 కిలోకు	160

రావులపాలెం అరటి మార్కెట్

గెల ఒక్కింటికి

రకం	గరిష్ఠ రూ.	కనిష్ఠ రూ.
కర్పూర	400	200
చక్రకేళి (తెలుపు)	400	150
చక్రకేళి (ఎరుపు)	600	300
అమృతపాణి	400	250
భుషావళి	250	100
దేశవాళి (కూరఅరటి)	350	100

చికెన్ ధర కిలోకు రూIIలో (వెన్‌కాబ్)

ఫారంరేటు	88-00
రిటైల్ లైవ్	103-00
డ్రెస్డ్	144-00
స్కిన్‌లెస్	170-00

రొయ్యల ధరలు - అమలాపురం

వనామీ ప్రాన్ (కిలో ఒక్కింటికి రూ.లలో)

20 కౌంట్ -	620	42 కౌంట్ -	390	63-70 కౌంట్ -	310
25 కౌంట్ -	520	43-45 కౌంట్ -	370	73-80 కౌంట్ -	290
30 కౌంట్ -	450	46-47 కౌంట్ -	360	83-90 కౌంట్ -	270
32 కౌంట్ -	430	50 కౌంట్ -	350	93-100 కౌంట్ -	250
40 కౌంట్ -	410	51-60 కౌంట్ -	330		



ప్రదక్షిణలు చేస్తున్న ఏలూరు రేంజి డీఐజీ వెంకట రామకృష్ణ దంపతులు

ఆలయాల్లో డీఐజీ దంపతుల ప్రత్యేక పూజలు

అయినవిల్లి: ఏలూరు రేంజి డిఐజీ వెంకట రామకృష్ణ దంతపతులు ఆదివారం అయినవిల్లి మండలంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ముక్తేశ్వరంలోని ముక్తికాంత సమేత క్షణముక్తేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అయినవిల్లిలో సిద్ధివినాయకస్వామి ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఆయా ఆలయాల అర్చకులు డీఐజీ దంపతులకు స్వాగతం పలికి, ఆలయాల విశిష్టతను వివరించారు. వేద ఆశీర్వచనం చేసి శేషవస్త్రాలు అందించారు. దేవస్థాన ఛైర్మన్‌లు వారికి తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఈయన వెంట అమలాపురం, రామచంద్రపురం డీఎస్పీలు ప్రసన్నకుమార్, మురళీకృష్ణ, అమలాపురం గ్రామీణ సీఐ జి.దేవకుమార్, స్థానిక ఎస్సై షేక్‌జానీబాషా తదితరులున్నారు.

విమానాశ్రయ సమాచారం

జెట్ ఎయిర్‌వేస్

✤ మొదటి సర్వీసు: రాజమహేంద్రవరం- హైదరాబాద్. ✤ బయలుదేరు సమయం: ఉదయం 11.15 ✤ రెండో సర్వీసు: రాజమహేంద్రవరం- హైదరాబాద్. ✤ బయలుదేరు సమయం: మధ్యాహ్నం 2.45

స్పైస్ జెట్

✤ సర్వీసు: రాజమహేంద్రవరం- హైదరాబాద్. ✤ బయలుదేరు సమయం: ఉదయం 11.30

ట్రూజెట్

✤ మొదటి సర్వీసు: రాజమహేంద్రవరం- బెంగళూరు. ✤ బయలుదేరు సమయం: ఉదయం 9.25 ✤ రెండో సర్వీసు: రాజమహేంద్రవరం- హైదరాబాద్. ✤ బయలుదేరు సమయం: మధ్యాహ్నం 1.30

– న్యూస్‌టుడే, కోరుకొండ

జానపదానికి నీరాజనం

● రేపు జానపద విజ్ఞాన దినోత్సవం
● నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాట్లు

రాజానగరం, న్యూస్‌టుడే: సాహిత్య, సాంస్కృతిక, భాషా కళారంగాల పరిరక్షణలో నన్నయ విశ్వవిద్యాలయం అగ్ర స్థానంలో నిలిచింది. విద్య, సాంస్కృతిక రాజధానిగా పేరొందిన రాజమహేంద్రవరం ప్రాంతంలో ఏర్పడిన నన్నయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ నిర్వహించిన అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, కార్యశాలలు, కవి సమ్మేళనాలు, కళా ప్రదర్శనలు 'నన్నయ'కు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి పెట్టాయి. తెలుగు శాఖ ఏర్పడిన తరువాత మొదట దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ(త్రివేండ్రం) సౌజన్యంతో జానపద విజ్ఞాన పరిశోధన - పరిరక్షణ అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సు విశ్వవిద్యాలయంలో జానపద పరిరక్షణకు బీజం వేసింది. అందులో భాగంగా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఏటా జానపదంపై ఒక జాతీయ సదస్సును ఏర్పాటు చేసి జానపద కళల ప్రదర్శన, కళాకారులకు సన్మాన సత్కారాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 40 మంది కళాకారులు సన్మానసత్కారాలు పొందారు. వారిలో తప్పెటగుళ్ళు, శక్తివేషదారులు ఉన్నారు.



మాలమాస్టీల ప్రదర్శన

గోదావరి జిల్లాల కళాకారుల చేత...

ఈ నెల 22వ తేదీన నన్నయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన కళాకారుల చేత గరగ నృత్యం, వీరనాట్యం, డప్పుల నృత్యాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉపకులపతి ఆచార్య ఎమ్.ముత్యాలునాయుడు ప్రారంభించనున్నారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పాల్గొననున్నారు. సభానంతరం ఉభయగోదావరి జిల్లాలకు చెందిన 30 మంది జానపద కళాకారులకు ప్రశంసాపత్రం, జ్ఞాపిక, శాలువతో సత్కారాలు ఉంటాయని ఆంధ్రజానపద విజ్ఞాన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సదస్సు కన్వీనర్ డా.తరపట్ల సత్యనారాయణ తెలిపారు.



గిరిజన నృత్యం

కళారంగాల అభివృద్ధికి కృషి

జానపద విజ్ఞాన పరిరక్షణకు విశ్వవిద్యాలయం తరపున కృషి చేస్తున్నాం. ద్రావిడ భాషల తులనాత్మక అధ్యయనంలో సాహిత్య సాంస్కృతిక వారసత్వ కళారంగాల పరిరక్షణ ప్రచారంలో సరికొత్త ప్రణాళికలతో ముందుకెళ్తున్నాం. అన్ని విశ్వవిద్యాలయాలలో అగ్రస్థానంలో నిలవాలనే ధ్యేయంతో నన్నయ తెలుగు శాఖ ముందడుగు వేస్తోంది.

- డా.తరపట్ల సత్యనారాయణ, సహాయాచార్యుడు, తెలుగు శాఖ, నన్నయ విశ్వవిద్యాలయం

పట్టు వడికే యంత్రాలతో రైతులకు లాభాలు



పట్టు తీసే యంత్రంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

చింతూరు, న్యూస్‌టుడే: నేరుగా పట్టు కాయలను విక్రయించే కంటే పట్టు దారం తీసి అమ్మడం వల్ల రైతులకు అధిక లాభాలు వస్తాయని సెంట్రల్ సిల్క్ బోర్డు జోనల్ డైరెక్టర్ మది అలగన్ అన్నారు. ఆదివారం చింతూరులో పట్టు రైతులకు పట్టు కాయల నుంచి దారం తీసే యంత్రాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మన్యంలో టస్సార్ పట్టు కాయలను పండించి అమ్ముతున్నారని, అధిక లాభాలు పొందే లక్ష్యంతో సిల్క్ నూతన యంత్రాన్ని రూపొందించిందని తెలిపారు. ఇది రూ. 10వేలకు లభిసుందన్నారు. రైతులకు 75 శాతం రాయితపై అందజేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ తీసిన దారాన్ని మార్కెటింగ్ చేసేందుకు చర్యలు చేపట్టినల్లు తెలిపారు. జిల్లా సిల్క్ బోర్డు ఉప సంచాలకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.





నృత్యాలతో సందడి చేస్తున్న నగరపాలక పాఠశాలల చిన్నారులు

చిన్నారుల కేరింత!

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద నిర్వహించిన 'ఆనంద ఆదివారం' కార్యక్రమం ఆద్యంతం చిన్నారుల కేరింతల మధ్య సందడిగా సాగింది. ఒకవైపు చిరుజల్లులతో వరుణుడు వారిని ఉత్సాహ పరిచాడు. వారమంతా నగరపాలక పాఠశాలల్లో విద్యతోపాటు సాంస్కృతిక అంశాల్లోనూ ఉపాధ్యాయులు శిక్షణ అందించి ఆటవిడుపుగా ఆనంద ఆదివారంలో వాటిని ప్రదర్శిస్తూ వారిలో స్ఫూర్తిని కలిగిస్తున్నారు. దేశభక్తి గీతాలు, సంప్రదాయ నృత్యాలు, జానపద సంగీతానికి అనుగుణంగా చిన్నారులు చేసిన ప్రదర్శనలు అలరించాయి.

ఒరిగిపోయిన 150 ఏళ్ల నాటి వృక్షం

ఆలమూరు మండలం నర్సిపూడిలో 150 సంవత్సరాల వయసు కలిగిన చెట్టు ఒరిగిపోయింది. వర్షాలకు ఇది పట్టు తప్పి ఒక వైపునకు వాలిపోయింది. పక్కనే ఉన్న కిళ్లీ కొట్టుకు కొమ్మలు తాకుతున్నాయి. దీంతో కిళ్లీ కొట్టును ఖాళీ చేశారు. క్రమేపీ చెట్టు పడిపోతే పక్కనుండే ఇళ్లపై పడే అవకాశముండటంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. నిద్రగన్నేరు రకానికి చెందిన ఈ వృక్షానికి 150 సంవత్సరాల వయసుంటుందని గ్రామస్థులు తెలిపారు. ఇది నీటిపారుదల శాఖ పరిధిలోనిదని దీనిని తొలగించాలని గతంలోనే విజ్ఞప్తి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా ఈ చెట్టును జాగ్రత్తగా తొలగించే పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సిపూడిలో ఒరిగిపోయి కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న 150 ఏళ్లనాటి చెట్టు, (అంతరచిత్రం) మొదలులో ఏర్పడిన తొర్ర

– న్యూస్‌టుడే, నర్సిపూడి(ఆలమూరు)

చలనచిత్రాలు **తిరుమల** - దర్శకుడు, **వీర్‌కమల్**- నిన్నుకోరి, **ఆనంద్**- లై, **అంజని** - నక్షత్రం, **సంగీత్**- నేనే రాజు నేనే మంత్రి, **గీత్**- ఆనబెల్, **దేవీస్క్రీన్ 1**- నేనే రాజు నేనే మంత్రి, **దేవీస్క్రీన్ 2**- ఫిదా, **దేవీస్క్రీన్ 3**- గౌతమ్‌నంద, **శ్రీప్రియ**- ఆనందోబ్రహ్మ, **పద్మప్రియ** - జయ జానకి నాయక, **సిఅండ్‌సి 1**- జయ జానకి నాయక, **సిఅండ్‌సి 2**- ఆనందోబ్రహ్మ, **లక్ష్మి** - ఆనబల్, **మయూరి** - దర్శకుడు, **సత్యగౌరి** - పెర్‌ఫ్యూమ్ గర్ల్.

కాకినాడ నగరం

నిన్నటి రైతు బజారు ధరలు

టమోటా-42, వంకాయలు-24, బెండకాయలు-20, బీరకాయలు-15, దొండకాయలు-28, కాకర కాయలు-26, పచ్చిమిరప-35, 52, క్యాబేజీ-24, క్యారెట్-34, బీట్‌రూట్-26, చిక్కుడు-80, 50, గోరుచిక్కుడు-28, దోసకాయ-14, ఆనపకాయ-14, 12, ఉల్లి-22, 20, బంగాళా దుంపలు-11, 15, అల్లం-65, 50.

తీరప్రాంతం.. ప్రకృతి సోయగం...



మత్స్యకారుల తుపాను షెల్టరు భవనం

14వ డివిజన్ ప్రత్యేకత ఇది

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ నగరంలో 14వ డివిజన్‌కు ప్రత్యేక ఉంది. ఈ ప్రాంతం సముద్రతీరానికి అతి దగ్గరగా ఉంటుంది. దాంతో ఈ ప్రాంతాన్ని ఏటిమొగ అని పిలుస్తారు. మడ అడవులు సమీపంలో.. సముద్రం నుంచి వేటకెళ్లి వచ్చిన బోట్లన్నీ ఇక్కడే కొలువు దీరుతాయి. దాంతో ఈ ప్రాంతం ప్రకృతి అందాలతో ఆహ్లాదంగా ఉంటుంది.

ఈ సీటును బీసీ జనరల్‌కు కేటాయించారు. ఇక్కడ ఓటర్లంతా మత్స్యకారులే. ఇందులో కొంచెం మహిళలే ఎక్కువ. దాంతో ఇక్కడ గెలుపోటములను ఈ వర్గీయులే ప్రభావితం చేస్తారు. వారికే ప్రధాన పార్టీలు ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకే సీట్లు కేటాయించాయి.

ప్రధాన ప్రాంతాలు: మంగమ్మ గుడి వీధి, నూకాలమ్మ గుడి వీధి, ఏటిమొగ, ఆంజనేయస్వామి గుడి వీధి, నంది గుడి వీధి, పాలేపువారి వీధి, ప్రధాన రోడ్డు

ప్రత్యేకతలు: ఈ ప్రాంతం సముద్రతీరానికి దగ్గరలో ఉంది. బోట్లన్నీ దరికి చేరి కొలువు దీరుతాయి. వాయుస్తంభ గుడి, ఎర్రరోడ్డు దుర్గమ్మ గుడి, నీలమ్మగుడి, నూకాలమ్మగుడి, అంగమ్మగుడి, పాతింగమ్మ గుడి, నంది గుడి, ఆంజనేయస్వామి గుడి తదితర ఆలయాలు ఇక్కడ కొలువుదీరాయి.



సమస్యలు: ఒకటే రోడ్డు ఉంది. ఒకే దారిలో చుట్టూ తిరిగి ఉంటుంది. ఇటువల పైపు లైన్ల కోసం రోడ్డును తవ్వేశారు. పునః నిర్మించాల్సి ఉంది. సరైన కాలువల వ్యవస్థ లేదు. మురుగు దిగేలా కాలువలు నిర్మించాలి. ఏటిమొగలో ప్లాట్‌ఫారాలు నిర్మించాలి.

డివిజన్ జనాభా	:	5888
మహిళలు	:	2990
పురుషులు	:	2898
ఓటర్లు	:	4338
పురుషులు	:	2145
మహిళలు	:	2193



తీరాన నిలిచిన బార్జీలు

ఇదీ డిమాండ్: డివిజన్‌లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయి. తీర ప్రాంతం కావటంతో కాలుష్య సమస్యలు కూడా ఎక్కువే. ఈ ప్రాంతంలో మొక్కలు విరివిగా నాటించాలి. వాడకం నీరు కిందకు పోయేలా మురుగు కాలువల వ్యవస్థను అభివృద్ధి చేయాలి.

మోహరించిన నేతలు... ప్రచార మోతలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం వడివడిగా సాగుతోంది. ప్రధాన రాజకీయ పార్టీ నేతలు కాకినాడలోనే మొహరించారు. ప్రచార ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. అభ్యర్థులతో పాటు నేతలు, ప్రజాప్రతినిధులు ఓటర్ల చెంతకు వెళ్లి తమ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. తెదేపా నుంచి మంత్రులు చినరాజప్ప, ప్రత్తిపాటి పుల్లారావు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు, అనుసంబంధ సంఘాల జిల్లానేతలు, వైకాపా నుంచి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ నేతలు కాకినాడలో మకాం వేశారు. తెదేపా అయితే ఆదివారం ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు అభ్యర్థులతో కలిసి ప్రచారం చేశారు. భాజపా కూడా ప్రచారం ముమ్మరం చేసింది. ఆపార్టీకి చెందిన రాష్ట్ర మంత్రి మాణిక్యాలరావు తమ అభ్యర్థుల తరపున తెదేపా మంత్రులతో కలిసి ప్రచారం నిర్వహించారు. 9వ డివిజన్‌లో భాజపా అభ్యర్థి మాలకొండయ్య తరపున ప్రచారం నిర్వహించారు. 34వ వార్డు వైకాపా అభ్యర్థి పసుపులేటి వెంకటలక్ష్మి తరపున రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, సినీనటుడు విజయచందర్ ప్రచారం చేశారు.. మొత్తం మీద కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఓటర్లను ఆకట్టుకునే రీతిలో ప్రచారం నిర్వహిస్తున్నారు.

★ 40వ డివిజన్ తెదేపా అభ్యర్థి సుంకర శివప్రసన్న రామారావుపేటలోని అపార్టుమెంట్స్‌లో ప్రచారం నిర్వహించారు. 46వ డివిజన్‌లో తెదేపా అభ్యర్థి కోరుమిల్లి బాలాప్రసాద్ ఎల్‌బీ నగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. 43వ డివిజన్‌లో తెదేపా అభ్యర్థి జేడీ పవన్‌కుమార్ ప్రతాప్‌నగర్‌లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. 47వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థి కొల్లాబత్తుల రాజ్యలక్ష్మి కరణం గారి సెంటర్‌లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వీధి నాటకం ద్వారా కళాకారులు ఉంగరం బొమ్మలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. 38వ వైకాపా అభ్యర్థి యార్లగడ్డ పద్మజ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 39వ డివిజన్‌లో వైకాపా అభ్యర్థి బాదం మంగారత్నం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 44వ డివిజన్ వైకాపా అభ్యర్థి ఇంటి గంగారత్నం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రచారం...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 13వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి కొప్పిశెట్టి సోమశేఖర్ ప్రచారం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పంతం నానాజీ ప్రచార కార్యక్రమంలో పాల్గొని, ఓటర్ల వద్దకు వెళ్లారు. గతంలో కాకినాడ నగరాన్ని అభివృద్ధి చేసిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు.



20వ డివిజన్లో సీపీఐ అభ్యర్థి జిఎస్ఆర్.కృష్ణ తరపున ప్రచారం చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి శేషబాబ్జి

వైకాపా అభ్యర్థులతో భేటీ...

కాకినాడ నగరపాలక సంస్థలో 48 డివిజన్ల నుంచి వైకాపా తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆదివారం స్థానిక పద్మనాభ ఫంక్షన్ హాల్లో సమావేశాన్ని నిర్వహించారు. ఆ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వీరితో చర్చించారు. డివిజన్‌లో పరిస్థితులను ఆరా తీశారు. ప్రచార ప్రక్రియ నిర్వహించాల్సిన వ్యూహాన్ని తెలియజేశారు.

గాంధీనగర్: 29వ డివిజన్లో తెదేపా-భాజపా ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న చిట్నీడి శ్రీనివాస్‌కు మద్దతుగా రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి పి. మాణిక్యాలరావు, భాజపా ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజులు మంత్రిప్రగడ వారి వీధిలో ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. 39వ డివిజన్‌లో పోటీలో ఉన్న కృష్ణప్రియకు మద్దతుగా రాష్ట్ర హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, దేవాదాయ శాఖామంత్రి మాణిక్యాలరావు, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, విష్ణుకుమార్‌రాజు, ఆకుల సత్యనారాయణలు రామారావుపేటలో ప్రచారం చేసి కమలం గుర్తుకు ఓటేయాలని కోరారు. 39వ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న మురుకూరి రామలక్ష్మి ఇంటింటికి తిరిగి హస్తం గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. 47వ డివిజన్‌లో భాజపా-తెదేపా ఉమ్మడి అభ్యర్థిగా పోటీచేస్తున్న గుంటూరు పద్మకు మద్దతుగా మంత్రి మాణిక్యాలరావు, విష్ణుకుమార్ రాజు, ఆకుల సత్యనారాయణ, తెదేపా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావులు అశోక్‌నగర్ ప్రాంతంలో పర్యటించి ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈసందర్భంగా డివిజన్‌లో పలువురు ప్రముఖులు మంత్రి మాణిక్యాలరావు సమక్షంలో భాజపాలో చేరగా, వారికి కండువాలు కప్పి భాజపాలోకి ఆహ్వానించారు. 46వ డివిజన్‌లో తెదేపా అభ్యర్థి కోరుమిల్లి బాలప్రసాద్‌కు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, భాజపా నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు తదితరులు విస్తృతంగా పర్యటించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. 20వ డివిజన్‌లో సీపీఐ అభ్యర్థిగా బరిలో ఉన్న కృష్ణకు మద్దతుగా సీపీఐ జిల్లా కార్యదర్శి దువ్వా శేషబాబ్జి పార్టీ నాయకులు మహాలక్ష్మీనగర్, ముత్తానగర్‌లలో విస్తృత ప్రచారం గావించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో 10వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ ఏరిపిల్లి చిన్నయ్య కోడలు ఏరిపిల్లి శాంతి ప్రచారం ముమ్మరం చేశారు.



29వ డివిజన్లో భాజపా అభ్యర్థి శ్రీనివాస్‌కు మద్దతుగా ప్రచారంలో మంత్రి మాణిక్యాలరావు, భాజపా ఫ్లోర్ లీడర్ విష్ణుకుమార్‌రాజులు

జగన్నాథపురం: జగన్నాథపురంలో తెదేపా అభ్యర్థిని 21వ డివిజన్‌లో సుల్తానాబేగమ్ తన అనుచరులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు .18వ డివిజన్‌లో వైకాపా అభ్యర్థి కోనాడ సత్యనారాయణ తన ప్రచారాన్ని నిర్వహించారు.. జగన్నాథపురం 26వ డివిజన్‌లో తెదేపా అభ్యర్థి సంగాని నందరం, 26వ డివిజన్‌లో వైకాపా అభ్యర్థి మచ్చాలోకేష్‌వర్మతో ముత్తా శశిధర్ ప్రచారంలో పాల్గొన్నారు. 23 డివిజన్ జగన్నాథపురంలో తెదేపా అభ్యర్థిని గుత్తుల జగదాంబ శుక్రవారం వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో వార్డు 24వ డివిజన్‌లో తెదేపా అభ్యర్థి డోకుబుర్ర భద్రం తన సహచరులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అదే డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థి లంక సంజీవ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు.

కారులు... బారులు..

గాంధీనగర్: కార్పొరేషన్ ఎన్నికలతో కాకినాడ కళకళలాడిపోతోంది. ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర అధికారపార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, పరిశీలకులతో డివిజన్‌లన్నీ సందడిగా మారాయి. ముఖ్యంగా ప్రచారానికి డివిజన్‌లకు వస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, వారి అనుచరగణం వాహనాల బార్లతో రోడ్లన్నీ నిండిపోతున్నాయి.



21వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న తెదేపా అభ్యర్థిని సుల్తానా బేగమ్



46వ డివిజన్లో తెదేపా అభ్యర్థి కోరుమిల్లి బాలప్రసాద్ తరపున ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



39వ డివిజన్‌లో భాజపా అభ్యర్థి కృష్ణప్రియ ప్రచారం



నగరంలో రామారావుపేటలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల కాన్వాయ్..

కాకినాడ నగరం

బ్యాలెట్ పత్రాల పరిశీలన

కాకినాడ నగరం: నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం బ్యాలెట్‌పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని ఆర్వో, ఏఆర్వోలతో నిర్వహించారు. విజయవాడ ప్రభుత్వ ముద్రణాలయం నుంచి వచ్చిన పత్రాలను కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్ల మధ్య పరిశీలించారు. కమిషనర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గడ్డిమొక్క నాటి గులాబీలు ఆశించొద్దు

సమర్థులను గెలిపించి.. సుందర కాకినాడను నిర్మిద్దాం ✪ అవగాహన సదస్సులో వక్తలు



సర్పవరంజంక్షన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోనే ప్రణాళికాబద్ధమైన నగరం కాకినాడ. పెన్షనర్స్ ... జ్‌గా పిలువబడే కాకినాడ స్మార్ట్‌సిటీకి ఏడేళ్ల త... ఎన్నికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఓటు హక... నియోగం, అర్హులు, సమర్థులైన, ప్రజా సమస్య... అవగాహన ఉన్న వ్యక్తులను ఎన్నుకోవాల్సిన ఆ... ఉందని పలువురు వక్తలు నగర ప్రజలకు సూచి... 1వ డివిజన్‌లోని బోటుక్లబ్ ఉద్యానంలో ఆదివా... వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సమావేశం సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు అధ్యక్షతన జరిగింది. జేఎన్టీయూ ప్రొఫెసర్ డా. ఆలపాటి ...ముఖ్యవక్తగా మాట్లాడారు. ఉదయం వ్యాయా...న నగరవాసులు పాల్గొన్నారు. ఈ సంద... శ్రీనివాస్ మాట్లాడుతూ మనం గడ్డిమొక్కను ...బీ పూలు ఆశించడం అత్యాశే. ఇలాగే స్వార్థ ...టు వేసి మంచి పాలన కోరడం సాధ్యం ...కే సమర్థులు, మంచి వ్యక్తులను ఎన్నుకో...జాస్వామ్య విలువలు పరిరక్షించుకోవాల్సిన ...దరిపై ఉంది. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటుహక్కును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా యువత మంచి అభ్యర్థులను ఎన్నుకుంటే మన తలరాతలు మనమే రాసుకోవచ్చు. అవినీతిపరులు, రాజకీయాలను వ్యాపారంగా భావించేవారు, నేర చరిత్ర ఉన్నవారిని దూరం పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా పాల్గొన్నవారు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్

అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేవారిని...



కొత్తగా ఎన్నికయ్యే కార్పొరేటర్లు డివిజన్ స్థాయిలో వీధులు, కాలనీల సమస్యలపై పూర్తి అవగాహన ఉండాలి. ఉదయాన్నే లేచి పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించి పలు సూచనలివ్వాలి. ప్రణాళికాబద్ధంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించాలి. అభివృద్ధి పనుల్లో ప్రజలు, కాలనీల సంఘాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి.

–యనమల రామం, న్యాయవాది

యువత, మేధావులకు అవకాశం ఇవ్వాలి



కార్పొరేషన్ ఎన్నికల్లో విద్యావంతులైన యువత, మేధావులకు ఎక్కువగా అవకాశమివ్వాలి. కోట్లాది రూపాయల నిధులతో స్మార్ట్‌సిటీ కాకినాడ అభివృద్ధి చెందే సమయంలో యువతకు అవకాశం ఇచ్చినట్లయితే ప్రణాళికాబద్ధంగా కాకినాడను తీర్చిదిద్దే అవకాశం ఉంటుంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు భాగస్వామ్యమయ్యే అవకాశం ఉన్నందున విద్యావంతులు ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకుని అభివృద్ధికి బాటలు వేస్తారు. దీనివల్ల ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

–ఆర్.సుమపట్నాయక్, కార్యదర్శి, లయన్స్‌క్లబ్ కాకినాడ

మంచి వారిని ఎన్నుకుందాం



చాలా సంవత్సరాల తర్వాత ఎన్నికలు జరుగుతున్నందున ఓటరు విజ్ఞతతో వ్యవహరించాలి. గతంలో సేవాభావంగల వ్యక్తులను ప్రజలే ఏరికోరి ఎన్నికల్లో నిలబెట్టి గెలిపించేవారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోవడంతో కుళ్లిన రాజకీయ వ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. కాకినాడను ప్రగతిపథంలో నడిపించే మంచి నాయకులను ఎన్నుకుందాం.

– గళ్లా సుబ్బారావు, భారతవికాస పరిషత్

భావితరాలకు ఆదర్శంగా నిలవాలి



మనం వేసే ఓటు మన డివిజన్‌లోని అభివృద్ధి పనులను ప్రభావితం చేస్తుంది. కుల, మత పార్టీలకతీతంగా అభ్యర్థులను ఎన్నుకోవాలి. రాజకీయ పరిజ్ఞానం కలిగి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ డివిజన్‌ను అభివృద్ధి చేసే సామర్థ్యం ఉండాలి. ప్రలోభాలకు లొంగకుండా భావితరాలకు ఆదర్శమంతమైన నాయకుడిని ఎన్నుకుందాం.

– పి.ఇందిరాగాంధీ, కాకినాడ

పార్టీలు మారే వారిని పక్కన పెట్టాలి



ఎన్నికలు వచ్చినప్పుడు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తరచూ పార్టీలు మారి కండువాలు మార్చుకునే వారిని పక్కన పెట్టాలి. సమర్థులు ఏ పార్టీలోఉన్నా ప్రజలు ఓటు వేసి ఎన్నుకుంటారు. గతంలో పార్టీలు మారాలంటే చాలా అవమానంగా భావించేవారు. ఈ మధ్య కాలంలో పార్టీలు మారడం ఫ్యాషన్‌గా మారింది. దీనిని ప్రజలు గమనిస్తున్నారని రాజకీయ నాయకులు గుర్తించాలి.

– ఏపీజె.విను, మానసిక విశ్లేషకుడు

అభివృద్ధి చేశాం.. ఇంకా చేస్తాం: వనమాడి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడను గడచిన మూడేళ్ల కాలంలో అభివృద్ధి పథాన ముందుకు తీసుకెళుతున్నామని ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. ఇకపై కూడా అభివృద్ధి పరంపరను కొనసాగిస్తామన్నారు. గత మూడేళ్లలో నగరంలో ఏమీ జరగలేదంటూ వైకాపా చేస్తున్న విమర్శలను వనమాడి తిప్పికొట్టారు. తన వెంట వస్తే ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపుతామన్నారు. అదే సమయంలో గత ప్రభుత్వ పాలనలో పోర్టు, రైల్వే భూములను ట్యాంపరింగ్ చేసి కబ్జా ఆనవాళ్లను కూడా చూపిస్తానని వనమాడి వెల్లడించారు. గత పదేళ్ల కాలంలో ప్రజల సమస్యలను పక్కనపెట్టి దోచుకునేందుకే ఆలోచన చేశారని వనమాడి విమర్శించారు. తాము నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని వివరించారు. నగరంలో అన్ని ప్రధాన రోడ్లలో సెంట్రల్ లైటింగ్‌తో ఆధునికీకరించామన్నారు. శాంతినగర్, భాస్కర్‌నగర్, ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డు, మిలట్రీరోడ్లను వెడల్పు చేశామని తెలిపారు. కాలువలను ఆధునికీకరించామన్నారు. కాకినాడకు మూడో వంతెనను మంజూరు చేయించామని వనమాడి తెలిపారు. అడిగినవారికల్లా పింఛన్లు, రేషను కార్డులు మంజూరు చేశామని తెలిపారు. ఇన్ని పనులు జరిగితే ఏమీ జరగలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైకాపా నాయకులపై ఆయన మండిపడ్డారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ నృసింహదేవర విశ్వనాథం, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు తాజుద్దీన్, పెంకే శ్రీనివాసబాబా తదితరులు పాల్గొన్నారు.

32 మందికి బ్లాక్‌బెల్ట్



బ్లాక్‌బెల్ట్ సాధించిన క్రీడాకారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ముఖ్యఅతిథులు

భానుగుడి సెంటర్, న్యూస్‌టుడే: బ్లాక్‌బెల్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన 32 మందికి ఆదివారం ధ్రువపత్రాల కార్యక్రమం జరిగింది. స్థానిక ఆండాళ్లమ్మ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పైడా ప్రసాద్, సెంట్రల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదనరావు, జిల్లా సంఘ అధ్యక్షుడు ఆకుల మధుసూదనరావు హాజరై బ్లాక్‌బెల్ట్ సాధించిన క్రీడాకారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పైడా ప్రసాద్ మాట్లాడుతూ బ్లాక్‌బెల్ట్ సాధించిన క్రీడాకారులు భవిష్యత్‌లో మరింతమందిని తయారుచేయాలన్నారు. ఆత్మరక్షణకు ఉపయోగపడే ఈ క్రీడను ముఖ్యంగా బాలికలకు నేర్పించాలన్నారు. సెక్రటరీ అర్జునరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింతమంది బ్లాక్ బెల్ట్ సాధించేలా శిక్షణ అందజేస్తామన్నారు.

రాజీవ్‌గాంధీ జయంతి

కాకినాడ కలెక్టరేట్: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పంతం నానాజీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాలో దేశం పురోభివృద్ధి సాధించటానికి రాజీవ్‌గాంధీ పునాది వేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడతామన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు నులకుర్తి వెంకటేశ్వరరావు, సబ్బతి ఫణేశ్వరరావు, తూము కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ మానవహక్కుల విభాగం అధ్యక్షుడిగా ఏడుకొండలు

గోకవరం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ మానవహక్కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుల్లా ఏడుకొండలు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియామక పత్రాన్ని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి నుంచి అందుకున్నారు. గోకవరంలోని ఆయన నివాసం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏడుకొండలు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ జిల్లా లీగల్ సెల్ మాజీ కన్వీనర్‌గా పనిచేసిన తనకు మళ్లీ ఈ పదవిని కట్టబెట్టినందుకు పీసీసీ అధికారప్రతినిధి రఘువీరారెడ్డితో పాటు కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు.

22న ఆదిశైవ అర్చక సంఘం సభ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఆంధ్ర రాష్ట్రీయ ఆదిశైవ అర్చక సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 22న పెదపూడి మండలం జి.మామిడాడలో నిర్వహిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ తెలిపారు. ఈ సమావేశంలో సంఘ బలాన్ని చాటుకోవడంతో పాటు సమాజంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సంఘపరంగా అర్చకులకు అందిస్తున్న సేవలను సమావేశంలో చర్చిస్తామని చెప్పారు.

ద్విచక్ర వాహనంపై మద్యం విక్రయాలు: నిందితుల అరెస్ట్

రాజమహేంద్రవరం నేరవార్తలు: ద్విచక్ర వాహనంపై తిరుగుతూ మద్యం విక్రయాలు చేస్తున్న మొబైల్ మద్యం అమ్మకందారులను ఏజీఎస్ పార్టీ పోలీసులు పట్టుకున్నారు. స్పెషల్ బ్రాంచి డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఏజీఎస్ ఎస్సై రాంబాబు, సిబ్బంది జాంపేట మార్కెట్ వద్ద నిఘా పెట్టారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు గోరు సురేష్‌కుమార్, రవికిరణ్, ఈతకోటి ప్రవీణ్‌లను పోలీసులు సోదాచేయగా 31 మద్యం సీసాలు లభించాయి. వారిని విచారించగా జాంపేట మార్కెట్ వద్ద చిరువ్యాపారులకు మద్యం విక్రయిస్తున్నట్లుగా అంగీకరించారు. వారిని అదుపులోకి తీసుకుని మద్యం విక్రయాలకు ఉపయోగించిన ద్విచక్రవాహనం, సెల్‌ఫోను, రూ.1,650 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు 1వ పట్టణ పోలీసులు తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: స్పెషల్ ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం పోలాల అమావాస్యరోజు ఏం చేయాలి? ఇంట్లో పూజించే విగ్రహాల ఎత్తు ఎంత ఉండాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: ఆమె (శ్రీకాంత్, ఊహ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'పుదీనా వాంగీబాత్', మీచేతివంట 'మునగాకు జీడిపప్పువేపుడు', 'పాలకూరపచ్చడి', జస్ట్ ఎమినిట్ 'ఉప్మాబోండా' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (సుప్రీండాన్స్‌షో) (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్

01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 హంగామా రిపీట్

సాయంత్రం

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 ఈ-జంక్షన్

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ. 3:30, సా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 03:00, సా. 4:00, రా. 9:00)
- ★ ఆయుష్ (ఉ. 9:30)
- ★ లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ. 10:00)
- ★ అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ - (మ. 1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ. 2:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ. 2:30, రా. 9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: బందీ (కృష్ణంరాజు విజయశాంతి), 10-00: మార్నింగ్ షో: గృహప్రవేశం (ఎల్.వి.ప్రసాద్, భానుమతి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: సందడే సందడి (జగపతిబాబు, శ్రీకాంత్), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఇందు (ప్రభుదేవా, రోజా), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దక్కయ్య (హరనాథ్, కృష్ణకుమారి), 10-00: సెకండ్‌షో: అసెంబ్లీ గూండా (దేవరాజ్, అరుంధతినాగ్).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ సాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ & చీజ్ స్టఫ్డ్ క్రిప్స్ & తెలగపిండి రవ్వ పులిహోర, ఉ.9:30: వావ్ ఏమి రుచి – అఖిడీ టుకో అప్యక్ & బోహేమనియన్ డ్రెస్సింగ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – జీలు & చిలకడదుంప గులాబ్ జామ్, ఉ.11.00: గోరు ముద్దలు – ఆప్రికాట్ చికెన్ బ్రౌన్ రైస్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – ఫ్రూటీ ఓట్స్, ఉ.11.30, రా.8:00: బాబాయ్ హోటల్ - పెసరట్టు ఉప్మా & అల్లం పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - సార్సో బాత్ ఇర్షాన్ మచ్ (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఓట్స్ మసాల పూరీ, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - షీ ఆనియన్ ఎగ్ ఫ్రైడ్ రైస్, మ.12.45, సా.6.15: సూప్స్ & స్టార్టర్స్ - డ్రమ్ స్టిక్ లీఫ్ & హార్స్ గ్రామ్ సూప్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి – గ్రిల్డ్ ప్రాన్స్ విత్ యుజు సాస్ (జపాన్ క్యూసైన్), మ.1.30, రా.10.00: చటపట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఆ కాకరకాయ పుల్ల బెల్లం పెట్టిన కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – చాక్లెట్ కప్ కేక్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – బీన్స్ ఉసిలి, మ.2.30, సా.6.00: చోటా షెఫ్ – సాబూదాన చుడ్వా, మ.2.45, రా.10.45: జిల్ – నట్టీ క్యారెట్ స్మూతీ & సిట్రస్ మింట్ ఫిజ్, మ.3.00: ఛాయ్ బిస్కెట్ – కాల్ జోన్స్ & చాక్లెట్ ఆల్మండ్ కాఫీ, మ.3.15: సూప్స్ & స్టార్టర్స్ - ఎగ్ డ్రాప్ సూప్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ భోగేశ్వర స్వామి ఆలయం, పామిడి, అనంతపురం జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, కందూరు మహబూబ్‌నగర్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 21-08-2017

TTD (SVBC): **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచభూత లింగాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 శ్రావణసోమవార వైభవం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: కృష్ణ, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: రాక్షసుడు.

మా: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: బన్ని, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఒకే జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

జెమిని: **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: రాజాబాబు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: రైడ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు. 10-00 సినిమా: కితకితలు.

HBO: **ఉదయం:** 06-00 ఆల్మోస్ట్ హీరోస్, 07-21 10,000 బీసీ, 09-20 ద గాడ్‌ఫాదర్, **మధ్యాహ్నం:** 12-29 ద హ్యాంగోవర్ పార్ట్-2, 2-15 ట్యాక్సీ 4, **సాయంత్రం:** 04-15 ద డార్క్ నైట్ రైజెస్, **రాత్రి:** 07-16 ఫైనల్ డెస్టినేషన్ 5, 9-00 టీనేజ్ మ్యూటెంట్ నింజ టర్టిల్స్: ఔట్ ఆఫ్ ది షాడోస్, 11-03 పారానార్మల్ ఆక్టివిటి 4.

రైతేరాజు

కొబ్బరి తోటల పెంపకంలో మెలకువలు

వర్షపాతం అధికంగా ఉండే ప్రాంతాలు కొబ్బరి సాగుకు అనుకూలం. నీటి సదుపాయం ఉండే గరప, ఎర్రనేలలు అనుకూలమైనవి. విత్తనం ఎంపిక దగ్గర నుంచి మొక్కలు నాటే వరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఏడాది, ఏడాదిన్నర వయసున్న మొక్కలను ఎకరాకు 60 చొప్పున నాటుకోవచ్చు. ఎంపిక చేసిన మొక్కను తీసిన గొయ్యి మధ్యలో ఉంచి మట్టితో నింపి గట్టిగా తొక్కి, పలచగా నీరు పెట్టాలని ఉండి కృషి విజ్ఞానకేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ పి.సుమన్‌బాబు తెలిపారు. కొబ్బరిలో మేలైన రకాలు, అంతరపంటల సాగు, ఎరువులు, తెగుళ్లు, పురుగుల యాజమాన్య పద్ధతులను వివరించారు.

రకాలు

✦ ఈస్ట్ కోస్ట్ టాల్, చౌగాట్ ఆరెంజ్, చౌగాట్ ఎల్లో, చౌగాట్ గ్రీన్, గంగా బొండం, ఫిలిఫైన్స్, మలయాన్ డార్ఫ్, డబుల్ సెంచరీ, గౌతమి గంగా రకాలను నాటుకోవచ్చు.



చెట్టు మొదలును ఆశించిన ఎర్రముక్కు పురుగు

ఎరువుల యాజమాన్యం: 1-4 సంవత్సరాల చెట్టుకి అర కిలో యూరియా, కిలో ఎస్ఎస్‌పీ, కిలో ఎంఒపీ 20 కిలోల పశువుల ఎరువు,

5 సంవత్సరాలు ఆపై చెట్టుకి కిలో యూరియా, 2 కిలోల ఎస్ఎస్‌పీ, రెండున్నర కిలోల ఎంఒపీ, 25 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల వేప పిండి చెట్టు చుట్టూ పళ్లెం తయారుచేసి రెండు దఫాలుగా వేయాలి. మొక్కలకు ఉప్పు వేయడం, వేర్లను నరికేయడం వంటి పనులు చేయకూడదు. ఇలా చేస్తే చెట్లకు హాని కలుగుతుంది.

అంతర పంటలు: ఐదు సంవత్సరాల్లోపు కొబ్బరి తోటల్లో గాలి, వెలుతురు బాగా ఉంటాయి. ఇటువంటి చోట్ల పసుపు, అల్లం, వంటి వాణిజ్య పంటలు, చేమ, కంద, తీగజాతి కూరగాయలు, మిరప, వంగ, బెండ, కాబేజీ, కాలిఫ్లవర్ మొదలగు కూరగాయ పంటలు, అపరాలు, వేరుశెనగ పండించుకోవచ్చు. 20 సంవత్సరాలు మించిన తోటల్లో అరటి, కోకో, బొప్పాయి వంటి పంటలు వేసుకోవచ్చు. అంతరపంటలకు అదనంగా ఎరువులు వేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే కొబ్బరిలో దిగుబడి తగ్గే అవకాశాలున్నాయి.

పురుగుల నియంత్రణ

నల్లమట్టి పురుగు: ఇది ఆశిస్తే లీటరు నీటికి డైక్లోరోవాస్ 1 మి.లీ. చొప్పున కలిపి చెట్టుపై పిచికారి చేయాలి.

కొమ్ము పురుగు: పడిపోయిన కొబ్బరి చెట్టును తొలగించి నాశనం చేయాలి. పశువుల గెత్తం కుప్పలను తోటల్లో ఉంచకూడదు. మూడు నెలలకు ఒకసారి కొబ్బరిచెట్ల మొవ్వుల్లో, వేపపిండి, వేపగింజల పొడిని 100-150 గ్రాముల ఇసుకలో కలిపి వేయాలి.

ఎర్రముక్కు పురుగు: ఇది ఆశించిన మొవ్వుల నుంచి పురుగును తీసివేసి వేప పిండి 100 గ్రాములు + 150 గ్రాముల ఇసుక మిశ్రమాన్ని రంధ్రంలో వేయాలి. కొబ్బరి మొదళ్లకు ఏ విధమైన గాయాలు చేయకూడదు, వేర్లు నరకరాదు, పచ్చి ఆకులను లాగకూడదు. 10 మి.లీ. నీటిలో మోనోక్రోటోఫాస్ 10 మి.లీ. కలిపి పాలిథీన్ సంచిలో పోసి వేరుకు కట్టాలి.

మొవ్వుకుళ్లు తెగులు: మొక్క వయసును బట్టి సంవత్సరం లోపు మొక్కకు 5 గ్రాములు, సంవత్సరం పైబడిన మొక్కకు 10 గ్రాముల సూడోమోనస్ ఫ్లోరిసెన్సు పొడిని మొక్క మొవ్వులో వెయ్యాలి.

–న్యూస్‌టుడే, ఉండి (ప.గో.జిల్లా)

పంటమార్పిడి-అంతరపంటలు

ఒకే పంటను ఒకే పొలంలో వరుసగా పండించడం వల్ల చీడపీడల ఉధృతికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయని, తద్వారా దిగుబడులపై ప్రభావం పడుతుందని కనుక పంటల మార్పిడి పాటించాలని వ్యవసాయాధికారులు సూచించారు. పురుగు జీవితచక్రం ముగించుకొని హాని కల్గించే స్థితికి చేరుకుంటుంది. ఒక పంటపై ఆశించే పురుగులు మరో పంటను ఆశించడం తక్కువ. పంట మార్పిడి చేస్తే పురుగు జీవిత చక్రం ఛేదింపపడుతుంది. అవి వృద్ధి చెందడానికి ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతాయి.

సాధారణంగా పాటించే పంటల సరళి అంతరపంటలు

✦ పప్పుధాన్యపు పంట ఆహారపంట-పప్పుధాన్యపు పైరు, చిరుధాన్యాలు ఆహారపంట-చిక్కుడు జాతి పచ్చిరొట్ట పైరు, వరి-పప్పుధాన్యపు పంట/వేరుశనగ/మొక్కజొన్న, పత్తి-జొన్న/మొక్కజొన్న, పొగాకు-మిరప/కూరగాయలు, చెరకు వరి/వేరుశనగ/కంది/ఆముదం/సజ్జ/జొన్న/

పంట మార్పిడి క్రమం: ఆహార వాణిజ్యపంటలు ఒక సారి, పప్పుజాతి పంటలు మరోసారి మార్పిడి చేయాలి. అవసరమైతే గడ్డిజాతి పైర్లు వేసుకోవాలి. భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్ట పైర్లు వేయాలి. పప్పుజాతి పంటల వేర్ల బుడిపెల్లో రైజోబియం సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తాయి.

హలో అనండి... సేవలు పొందండి

■ ప్రభుత్వ శాఖల్లో అందుబాటులో పలు టోల్‌ఫ్రీ నంబర్లు ■ అత్యవసర వేళ ఉచిత సేవలు

రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే: వివిధ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ సేవలను పొందడానికి ప్రతి ఒక్కరూ ఉచితంగా సంప్రదించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులో ఉంచాయి. ఎలాంటి ఖర్చు లేకుండా ఈ నెంబర్లకు సంప్రదించి సేవలు పొందవచ్చు.

శాంతిభద్రతలకు 100



శాంతి భద్రతలకు విఘాతం కలిగినట్లు భావిస్తే తక్షణమే 100కు సమాచారం తెలియజేశారు. ఆ వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్ ల్యాండ్‌లైన్‌కు సమాచారం అందజేస్తారు. ఆ ప్రాంత ఎస్సైకు సంక్షిప్త సమాచారం(ఎస్ఎంఎస్) రూపంలో పంపిస్తారు.

అగ్ని ప్రమాదాల నివారణకు 101

ఎక్కడైనా, ఎప్పుడైనా అగ్ని ప్రమాదాలు సంభవించే సమయాల్లో



అగ్నిమాపక సిబ్బంది బాధితులను ఆదుకోవాలంటే 101 నెంబరుకు ఫోన్ చేస్తే చాలు. బీఎస్ఎన్ఎల్ ల్యాండ్‌లైన్ ద్వారా ఫోన్ చేస్తే నేరుగా సంబంధిత మండలానికి(సమీప కేంద్రం ఉన్న ప్రదేశానికి) చేరుతుంది. ఇతర ఫోన్ల ద్వారా అయితే జిల్లా కేంద్రానికి చేరి అక్కడి నుంచి ప్రమాదం జరిగిన ప్రదేశం ఉన్న అగ్నిమాపక కార్యాలయానికి చేరుతుంది.

ఆపదలో ఉన్న వారికి 108



ఎవరైనా ప్రమాదాల బారిన పడినా, ఇతర కారణాలతో తీవ్ర అస్వస్థతకు గురైన వారిని ఆదుకునేందుకు 108 వాహనం 24 గంటలూ అందుబాటులో ఉంటోంది. చరవాణి, ల్యాండ్ లైన్ నెంబర్ నుంచి 108 ఫోన్ చేస్తే అది కాల్‌సెంటర్‌కు సమాచారం అందజేస్తుంది. జిల్లా, మండలం, గ్రామం తదితర వివరాలను సంబంధిత 108 వాహనం ఈఎంటీకు చేరవేస్తుంది. పైలట్ సమాచారాన్ని నిర్ధారించుకుని సంఘటనా స్థలానికి చేరుకుంటారు.

చిన్నారులకు అండగా 1098



ఆరుబయట ఉండే చిన్నారులు, అనాథ పిల్లలు వంటి వాళ్లను అక్కున చేర్చుకునేందుకు 1098కు సమాచారం అందజేయాలి. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినా ఈ నెంబరుకు సమాచారం అందజేయవచ్చు. ఏ జిల్లా నుంచి కాల్ వచ్చిందో అదే జిల్లాలోని సమీప మండలాల్లో ఉండే చైల్డ్‌లైన్ సిబ్బందికి సమాచారం ఇచ్చి సమస్య పరిష్కరించేంత వరకు వెంట ఉంటారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికి 1912

విద్యుత్తు విభాగంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఉపయోగించే నంబరు 1912. ఫిర్యాదుదారుడు చేసిన సమస్యపై 1912 కాల్‌సెంటర్‌లో సమస్యను నమోదుచేసి సంబంధిత ప్రాంత అధికారులకు సమాచారాన్ని చేరవేస్తారు. నిర్ణీత గడువు తర్వాత సమస్య పరిష్కారం అయిందా..? లేదా? ఎంతవరకు వచ్చిందో కాల్‌సెంటర్ నుంచి నేరుగా అడిగి తెలుసుకుంటారు.

ఏపీఎస్ఆర్టీసీలో ఫిర్యాదులకు 1800-200-4599

ప్రయాణికులు తాము ప్రయాణించే మార్గాల్లో ఎదుర్కొన్న పలు సమస్యలకు, ఫిర్యాదులు, సలహాలు, సూచనలు అందించేందుకు ఏపీఎస్ఆర్టీసీ 1800-200-4599 టోల్‌ఫ్రీ నెంబరును అందుబాటులో ఉంచింది.

ఉపాధిహామీ పథకం 1800-425-4440



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా లబ్ధి పొందుతున్న వారంతా తమ సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే టోల్‌ఫ్రీ నెం 1800-425-4440. వేతనం అందకపోయినా లేదా ఫిర్యాదులు, సూచనలు, సలహాలు అందజేసేందుకు ఈ నంబరును వినియోగించవచ్చు.

మీ-సేవ సంబంధిత సమస్యలకు 1100



వివిధ ధ్రువీకరణ పత్రాలతో పాటు పలు సేవలను మీసేవ ద్వారా పొందేలా ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ సేవల్లో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వీటిపై 1100 ఫోన్‌చేస్తే పరిష్కారం లభిస్తుంది.

పారిశ్రామిక ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి) కొన్నింటికి బ్యాంకు రుణాల ప్రక్రియ కొనసాగుతోంది. సుమారు రూ. 41 కోట్ల పెట్టుబడితో ముందుకొచ్చిన ఈ సంస్థలు ఏర్పాటైతే జిల్లాలో సుమారు 650 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రధానంగా జేగురుపాడు ఇండస్ట్రియల్ ఎస్టేట్ పరిధిలో ఎక్కువ మంది సంస్థల ఏర్పాటుకు ఆసక్తి చూపారు. వీటిలో రూ. 75 లక్షల నుంచి రూ. 10 కోట్ల పెట్టుబడి పెట్టే సంస్థలు ఉన్నాయి. కడియం మండలంలో ప్రధానంగా పీవీసీ షీట్స్ తయారీ కేంద్రాలు, ప్లాస్టిక్‌తో వివిధ వస్తువులు, బొమ్మల తయారీ, జీడి పిక్కల పరిశ్రమలు, రెడీమేడ్ వస్త్రాలు, పాలథిన్ కవర్లు, బయోడీజిల్ బంకు, సిరామిక్ ఉత్పత్తులు, ప్లాస్టిక్ గొట్టాలు, పాల ఉత్పత్తులు తదితర కేంద్రాలు ఉన్నాయి. మౌలిక వసతుల కల్పనకు సంబంధించి ఓ సంస్థ రూ. 10 కోట్లతో ముందుకొచ్చింది. టిష్యూ తయారీ కేంద్రాన్ని అంతర్వేదిలో, బయోడీజిల్ బంకును గొల్లప్రోలు మండలంలో ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు మినహాయిస్తే 21 పరిశ్రమలను జేగురుపాడు పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.

సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి వేగంగా జరుగుతోంది. భవిష్యత్తులో మరింత మంది పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చే అవకాశాలున్నాయి. ఒప్పందం చేసుకున్న ప్రతి సంస్థ వద్దకూ తమ తరఫున ఒక అధికారి వెళ్లి వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. చిన్న, మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నాం.

-ఏజీ పటేల్, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల శాఖ

జనవరిలో రేలాపండూం

ఆదివాసీ సంక్షేమ పరిషత్తు తెలుగు రాష్ట్రాల కార్యదర్శి వెల్లడి

చింతూరు, న్యూస్‌టుడే: ఆదివాసీ సాంస్కృతి సమ్మేళనం రేలాపండూం వచ్చే ఏడాది జనవరి 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్తు తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి, రేలాపండూం జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఎర్రంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసుల సాంస్కృతి, సంప్రదాయలు, మనుగడ కాపాడాలనే లక్ష్యంతో జాతీయ స్థాయిలో గత రెండేళ్లుగా చింతూరు కేంద్రంగా రేలాపండూం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడో జాతీయ రేలాపండూంను 2018 జనవరిలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాట్లు వివరించారు. ఆదివాసుల సంస్కృతి, ఆచార వ్యవహారాలు, జీవన విధానాన్ని గుర్తుకు తెచ్చేలా, దేశంలోని గిరిజనుల సంస్కృతి, సంప్రదాయలను ప్రదర్శించే వేదికగా రేలాపండూం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి, నాయకులు మడివి నెహ్రూ, కుర్సం దారయ్య, లక్ష్మయ్య, వెంకట్, వెంకన్నబాబు, రమేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి తెదేపా ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికలను మొత్తంగా పర్యవేక్షించే బాధ్యతను తెదేపా అధిష్ఠానం ముగ్గురు నాయకులకు అప్పగించింది. రాజమహేంద్రవరం గ్రామీణం, రాజోలు ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు భాస్కరరావులకు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. రాష్ట్ర మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఈ విషయమై ఆదివారం భాస్కరరామారావు ఇంట్లో భేటీ అయ్యారు. భాస్కరరామారావు, సూర్యారావు, బుచ్చయ్యచౌదరిలకు ఈ విషయాన్ని చెప్పి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే డివిజన్లలో వార్డు ఇన్‌ఛార్జీలుగాను, క్లస్టరు ఇన్‌ఛార్జీలుగా పనిచేస్తున్న ఎమ్మెల్యేలు, ఇతర పార్టీ నాయకుల పనితీరుపై వీరు పర్యవేక్షణ చేస్తారు. ఎప్పటికప్పుడు నివేదికను అధిష్ఠానానికి అందిస్తారు.

వినాయక ఉత్సవాల ఏర్పాట్లపై వివాదం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గణేష్ ఉత్సవాల ఏర్పాట్లును నగరపాలకసంస్థ ప్రణాళికా విభాగం అధికారులు అడ్డుకోవడంతో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ప్రతి ఏడాది వైకాపా రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా నేతృత్వంలో ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది నగరపాలకసంస్థ అధికారులు ఉత్సవ పందిళ్ల ఏర్పాట్లపై ఆంక్షలు విధించారు. ఇందుకు ఉత్సవ కమిటీ వ్యతిరేకించడంతో వివాదం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం డిప్యూటీ కమిషనర్ ఫణిరాం, ప్రణాళికా విభాగం అధికారి రాంకుమార్‌తోపాటు మున్సిపల్ సిబ్బంది పందిరి ఏర్పాట్లను అడ్డుకున్నారు. దీంతో జక్కంపూడి రాజా, సుంకర చిన్ని, ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మేడపాటి షర్మిలారెడ్డి, బొంతా శ్రీహరి తదితరులు అక్కడకు చేరుకున్నారు. నగరంలో అధికారపార్టీ నాయకులు, ప్రముఖులు పలుచోట్ల రోడ్లను ఆక్రమించి పందిళ్లు వేస్తున్నారని, వారిని అడ్డుకోకుండా ప్రతిపక్షంపై అక్కసు వెళ్లగక్కడం సరికాదంటూ వాదించారు. ముందు వాటికి సమాధానం చెప్పాలంటూ వారంతా భైఠాయించారు. ఈ నేపథ్యంలో అధికారులు, నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఉత్సవ కమిటీ నాయకులు ససేమిరా అనడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అర్ధరాత్రి వరకూ ఉత్కంఠ కొనసాగింది.

ప్రచారంలోనూ పోటాపోటీ

(మొదటి పేజీ తరువాయి) రెబల్స్ సమస్య అధికంగా ఉండడంతో వారిని పోటీ నుంచి తప్పించేందుకు నాయకులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. మరోవైపు పోటీలో ఉండే అభ్యర్థులందరికీ పార్టీ ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైకాపా అభ్యర్థుల తరఫున రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఇతర నేతలు 34వ డివిజన్‌లో ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కూడా ఆయా డివిజన్లలో ప్రచారాన్ని చేపట్టారు.

గుండెల్లో రెబెల్స్

(మొదటి పేజీ తరువాయి) ప్రభావం ఎవరిపై పడుతుందోనన్న ఆందోళన తెదేపా, వైకాపా నేతల్లో నెలకొంది. 13వ డివిజన్‌లో ఆరుగురు, 32వ డివిజన్‌లో తొమ్మిది మంది స్వతంత్రులు పోటీ చేస్తున్నారు. రెండో డివిజన్‌లో అయిదుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. అయిదో డివిజన్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ప్రధాన పార్టీల నుంచి అవకాశం రాని వారు రెబల్స్‌గా బరిలో ఉండడంతో ఆయా పార్టీల అభ్యర్థులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అయిదో డివిజన్‌ను భాజపాకు కేటాయించగా ఇక్కడ తెదేపా నుంచి రెబల్ పోటీలో ఉండడంపై భాజపా నేతలు ఆ పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఇక ఎనిమిదో డివిజన్‌లో అయిదుగురు స్వతంత్రులు పోటీలో ఉన్నారు. రెబల్స్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆయా డివిజన్లలో హడావుడి చేస్తుండడం ఆయా పార్టీల నేతలను కలవరపరుస్తోంది. ఇప్పటికే వారు ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించి ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మొత్తం 121 మంది స్వతంత్ర అభ్యర్థుల్లో వైకాపా, తెదేపా నుంచి 62 మంది రెబల్స్‌గా బరిలో మిగిలారు. ఈ పార్టీకీ సంబంధం లేకుండా స్వతంత్రులుగా పోటీ చేస్తున్న వారు 59 మంది ఉన్నారు. తెదేపా, వైకాపా నేతలు విజయమే లక్ష్యంగా వ్యూహాలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా రెబల్స్‌గా పోటీ చేస్తున్న వారిని బుజ్జగించి పోటీ నుంచి విరమింపజేయడంపై వారు దృష్టి నిలిపారు.



అభివృద్ధి పథంలో నడిపిస్తా



నేనే మేయర్ అయితే.. కాకినాడను అభివృద్ధి పథంలో నడిపిస్తాను. నగరం ప్రత్యేకతలను అందరికీ తెలిసేలా అధికారులతో సమన్వయంతో పనిచేస్తా. కాకినాడ అన్ని రంగాల్లోనూ ప్రత్యేకమైనది. ఇందుకు తగ్గట్లు పనులు చేయించి మరింత ఆదర్శంగా తీర్చిదిద్దుతాను.

-ఎం.సిద్ధు, బి.టెక్ విద్యార్థి, ముత్తానగర్

యువతకు ఉపాధి అవకాశాలు



ప్రస్తుతం నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉంది. నేను మేయర్ అయితే నగరాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. విద్య, ఉపాధి రంగాలకు పెద్దపీట వేస్తాను.

-గౌతు చిన్న, చిరుద్యోగి, శ్రీనగర్

పర్యాటకంగా అభివృద్ధి చేస్తాను



అధికారులు, కార్మికుల సమన్వయంతో నగర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛనగరంగా తీర్చిదిద్దుతాను. పర్యాటకంగా మరిన్ని సౌకర్యాలు కల్పించి ఇతర జిల్లాల సందర్శకులు వచ్చేలా సౌకర్యాలు కల్పిస్తాను. పేదలందరికీ గృహ వసతి, ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేయిస్తా.

-జి.అన్నపూర్ణ, టైలర్, ద్వారకానగర్



27 పైసలకు అమ్ముడుపోవద్దు



ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు లొంగిపోకుండా సమర్థులకు ఓటు వేసి కార్పొరేషన్‌కు పంపితే రాబోయే ఐదేళ్లలో అభివృద్ధి జరిగి దేశంలోనే అత్యుత్తమ ఆకర్షణీయ నగరంగా కాకినాడ ఆవిర్భవిస్తుంది. ఓటేయడానికి రూ.500 అభ్యర్థుల నుంచి తీసుకుంటే ఈ లెక్కన ఐదేళ్లలో రోజుకు 27 పైసలకు మనం అమ్ముడుపోయినట్లు. ఇలా ఓట్లు కొనుక్కుని ఎన్నికల్లో గెలిచిన వారు ఖర్చుచేసిన సొమ్ముకు పదింతలు సంపాదించుకునే పనిలోపడతారు. మనం కూడా అవినీతిని ప్రశ్నించే హక్కును కోల్పోతాం.

-బుద్ధరాజు సత్యనారాయణరాజు, సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

ఆదివారం దొరికేశామురో...

రాకరాక వచ్చిన ఆదివారం.. ఎన్ని పనులు ప్లాన్ చేసుకున్నాను... అన్నీ ఆగిపోయాయి... ఉదయం నుంచీ అడుగు బయటకు పెడతామంటే ఏమిటో ఈ గోల అంటూ పలువురు ఉద్యోగులు వాపోయారు. ఇంతకీ విషయం ఏమిటంటే...



నగరపాలక సంస్థ ఎన్నికలు అభ్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గెలుపే లక్ష్యంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు పరుగులు తీస్తున్నారు. ప్రచారం పేరుతో రోజూ ఇంటింటా తిరిగి ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్న అభ్యర్థులకు ఉద్యోగులు మాత్రం చిక్కడం లేదు. ఎందుకంటే ఉదయం 9 గంటలకు గానీ పలువురి ప్రచారం మొదలు కావటంలేదు. అప్పటికి ఉద్యోగులు విధులకు వెళ్లిపోతున్నారు. దాంతో వారిని పట్టుకుని ఓటు అభ్యర్థించటం వీలు కావటం లేదు. సెలవు రోజున ఎలాగూ ఉద్యోగులు ఇంటివద్దే ఉంటారు. ఈ రోజును సద్వినియోగం చేసుకోంటే... అంటూ మెదిలిన ఆలోచనను అభ్యర్థులు అమలు చేసేశారు. ముందుగానే శనివారం రాత్రే ఇందుకు వ్యూహాలు రూపొందించుకున్నారు. ఆదివారం ఉదయాన్నే ఉద్యోగుల ఇళ్లముందు వాలిపోయారు. మీ కోసం ప్రత్యేకించి వచ్చాం. మమ్మల్ని గెలిపించే బాధ్యత మీదే అంటూ అభ్యర్థించడం పలు డివిజన్లలో కనిపించింది. కొందరైతే ముందుగానే ఫోను చేసి మరీ... మీ ఇంటికొస్తున్నామంటూ ఉద్యోగులకు సమాచారం ఇస్తున్నారు. 'పలుమార్లు కలిసేందుకు వచ్చాం. మీరు లేరు... ప్రత్యేకించి ఈ రోజు వచ్చాం' అంటూ చెబుతుండడంతో ఉద్యోగులకు ఏం చేయాలో తెలియడం లేదు. ఎప్పుడూ పలకరించనివారు కూడా వెదుక్కుని మరీ రావటంతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఒకరైతే ఫర్వాలేదు... ఒకరితర్వాత ఒకరు అలా వస్తునే ఉండడంతో ఏం చెప్పాలో తెలియలేదు. 25న వినాయక చవితి రోజున కూడా ఉద్యోగులు ఇంటివద్దే ఉంటారు. ఈ సెలవు దినాన్ని కూడా సద్వినియోగం చేసుకునేందుకు పార్టీల అభ్యర్థులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఉద్యోగులు... పారాహుషార్...!

–న్యూస్‌టుడే, కాకినాడ నగరం

మేయర్ మారాజు

ఈ చిత్రంలో రిక్షాపై వెళ్తున్న వ్యక్తి ఎవరు... ఇతని కోసం ఎందుకిపుడు ప్రస్తావన అంటే...ఈ తరం నాయకులు ఒక్కసారి తెలుసుకోవల్సిన వ్యక్తి. ఆదర్శ ప్రదాత. ఈయన పేరు డాక్టర్ ప్రఫుల్లా జిత్ సిన్హా... త్రిపుర రాజధాని అగర్తలా నగర మేయర్. ప్రతి రోజూ కార్యాలయానికి ఇలా రిక్షాలోనే వెళ్లి వస్తుంటారు. ప్రభుత్వం వాహన సౌకర్యం కల్పించినప్పటికీ దాన్ని ఆయన వినియోగించరు. ప్రజా సమస్యలను తెలుసుకోడానికి ఆయనే స్వయంగా కాలిబాటన వెళతారు. లేకుంటే ఇలా రిక్షాలో



వెళ్లి వస్తుంటారు. ఇప్పటికీ ప్రజల కోసం నిస్వార్థ జీవితాన్ని గడుపుతున్నారు. చిన్నచిన్న పదవులకే కారు లేనిదే కాలు బయటపెట్టని పలువురు ఇలాంటి వ్యక్తుల నుంచి ఎంతో నేర్చుకోవాలన్నది ఓటరు మాట.. అదే స్ఫూర్తి బాట.

–న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్



ఆ రోజుల్లో...



ఆ రోజుల్లో ఎన్నికలంటే ఎంతో సందడిగా ఉండేది. మేం వెళ్లి ఓటువేసి వచ్చేవాళ్లం. అభ్యర్థులు మంచివారైతేనే ఓటు వేసేవాళ్లం. అప్పట్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు రెండే ఉండేవి. ఓటును ఎంతో పవిత్రంగా భావించేవాళ్లం.

- వాడకట్టు రంగనాయకమ్మ, 95 ఏళ్లు

–న్యూస్‌టుడే, గాంధీనగర్



రహదారుల విస్తరణ... విద్యకు కార్పొరేట్ హంగు... ఆధునికతతో కూడిన పౌరసేవలు నగరవాసులకు రానున్న రోజుల్లో అందించడానికి ఆకర్షణీయ అడుగులు పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో ఫేజ్-1లో రూ.1,212.13 కోట్ల నిధులతో స్మార్ట్‌సిటీ పనులు ఊపందుకోనున్నాయి. దేశవ్యాప్తంగా జరిగిన ఆకర్షణీయ నగర ఎంపికలో తొలి జాబితాలోనే చోటు సంపాదించిన కాకినాడ.. త్వరలోనే అన్నీ రంగాల్లో నైపుణ్య నగరంగా ఆవిర్భవించనుంది. పౌర సేవలతోపాటు మౌలిక వసతులు మరిన్ని రానున్నాయి. ఒకప్పుడు ఫించనుదారుల స్వర్గధామంగా పిలిచే ఈ ప్రాంతం నేడు పెట్టుబడుల ఆకర్షణీయ నగరంగా అభివృద్ధి చెందనుంది.

అదిగదిగో నైపుణ్య నగరి

రూ.1,212.13 కోట్లతో తొలిదశ ఆకర్షణీయ ప్రణాళిక

ఈనాడు, కాకినాడ

నగరంలో ఇరుకైన రహదారులను విస్తరించనున్నారు. వీటికి ఆధునిక సాంకేతికతను జోడిస్తారు. ప్రణాళికాబద్ధమైన ట్రాఫిక్, సీసీ కెమెరాలు, పాదచారులకు ప్రత్యేక నడక మార్గాలు(ఫుట్‌పాత్‌లు), భూగర్భ విద్యుత్తు సరఫరా లాంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటుకు ఇప్పటికే రూ.94.89 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచారు. ఈ పనులు త్వరలోనే పూర్తికానున్నాయి.

- రూ.75.64 కోట్లతో కాకినాడ ప్రధాన రహదారిని సర్పవరం కూడలి నుంచి బాలయోగి విగ్రహం వరకు అభివృద్ధి చేయనున్నారు. వీటితోపాటు కాలనీల్లో ఉండే పలు రహదారుల స్వరూపం మారనుంది.
- సర్పవరం నుంచి ఆర్టీవో కార్యాలయం మీదుగా జగన్నాథపురం వరకు రూ.90 కోట్లతో చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులు టెండర్ల దశలో ఉన్నాయి.



రాబోయే రోజుల్లో నగరానికి రానున్న అధునాతన సౌకర్యాలు

విద్యకు ఊతం

నగరపాలక సంస్థ పరిధిలో ఉండే విద్యాసంస్థలు కార్పొరేట్ స్థాయికి తీసుకొచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికలున్నాయి. నేటి తరానికి ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో విద్యను అందివ్వాలనే సంకల్పం స్మార్ట్‌సిటీల ద్వారా నెరవేరనుంది. ఉన్నత పాఠశాలల మౌలిక వసతుల్లో మార్పులు, వర్చువల్ తరగతి గదులు, డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు, కంప్యూటర్ ల్యాబ్‌లు, స్టూడియోల ఏర్పాటు చేపడుతున్నారు. ఇందుకోసం సుమారు రూ.23.75 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రూ.2 కోట్లతో ప్రాథమిక పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. ఇప్పటికే ఈ పాఠశాల కింద 7 తరగతి గదుల్లో పైలెట్ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు.

పౌర సేవలకు పెద్దపీట

స్మార్ట్‌సిటీలో భాగంగా పౌరులకు రోజువారీ అందించే సేవల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. రూ.7.13 కోట్లతో ఈ రిక్షాలను అందుబాటులోకి తేవడం, రూ.4 కోట్లతో గాంధీపార్కు పునరుద్ధరణ-ఆధునికీకరణ, రూ.8.17 కోట్లతో వివేకానంద పార్కు ఆధునికీకరణ, సుందరీకరణ పనులు చేపట్టనున్నారు. రూ.10 కోట్లతో ఏటిమొగ వద్ద సీవరేజ్ సిస్టమ్ ఏర్పాటు, రూ.6.96 కోట్లతో పెద్దమార్కెట్ ఆధునికీకరణ, రూ.5.47 కోట్లతో ప్రతాప్‌నగర్ వద్ద రెండులైన్ల రహదారి నిర్మాణం, రూ.2 కోట్లతో బయోగ్యాస్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన పనులు టెండర్ల దశలో ఉన్నాయి. వీటితోపాటు రూ.240 కోట్లతో 140 కిలోమీటర్ల సీవరేజ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. రూ.307 కోట్లతో రహదారులకు ఇరువైపులా వర్షపు నీరు ప్రవాహానికి అనువైన డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. రూ.21 కోట్లతో సోలార్ రూఫ్ టాప్ పనులు మొదలయ్యాయి. ఏలేరు డ్రైన్ మీద రూ.3.25 కోట్లతో వంతెన నిర్మాణం పూర్తిచేశారు.

వీటితో పాటు...

- నగరంలో ఉండే ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా చేసేందుకు స్మార్ట్‌సిటీ ద్వారా రూ.90 కోట్లతో తాగునీటి పథకాల ఆధునికీకరణ చేపట్టనున్నారు. 24 గంటల పాటు నీటి సరఫరా ఉండేటట్లు సంస్కరణలు తీసుకొస్తున్నారు.
- రూ.34.06 కోట్లతో బోట్‌బిల్డింగ్ యార్డ్ నిర్మాణం, ఫిష్ ప్రోసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు.
- రూ.92 కోట్లతో వాణిజ్య కాలువను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ల దశలో ఉన్నాయి.
- రూ.50 కోట్లతో ఆధునిక బస్ టెర్మినల్‌ను అందుబాటులోకి తేనున్నారు. ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి దూరప్రాంతాలకు ప్రయాణించే వారికి వీలుగా మల్టీప్లెక్స్ థియేటర్లను, రెస్టారెంట్లను, విశ్రాంతి గదులను, వినోద కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.



హాయ్... నమస్తే.. గుడ్‌మార్నింగ్... ఆదాబ్... ఇన్ని నమస్కారాలెందుకా...? మన కార్పొరేషన్ ఎన్నికల వేళ నగరంలో ఎక్కడ చూసినా ఇవే దండాలండి. ***దండాలయ్యా... ఓటరయ్యా... దయుంచయ్యా దేవా... మా అండాదండా నీవేనయ్యా... చూపించయ్యా*** తోవ... అని అభ్యర్థులు ఓటర్లకు దండాలతో దండలేస్తున్నారు. ఒకరా... ఇద్దరా.. వరసగా వచ్చిపోతున్న అభ్యర్థులకు నమస్కారానికి... ప్రతి నమస్కారం... మన సంస్కారం అంటూ ప్రజలూ దండలు పెడుతున్నారు. ఇంతవరకు ఫర్వాలేదు... నాయకులకో దండంరాబాబు అనే పరిస్థితి మాత్రం తెచ్చుకుంటే కష్టమండి.

అప్పుడో... ఇప్పుడో.. ఎప్పుడో...కలగన్నానే మరి... అక్కడో... ఇక్కడో... ఎక్కడో... ఓటేస్తారా మరి... అంటూ అభ్యర్థులు ప్రచార జోరు కొనసాగిస్తున్నారు. కొందరు నాయకులు ఎన్నికలు ఎప్పుడొస్తాయా అని ఏడేళ్లుగా ఎదురుచూస్తునే ఉన్నారు. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని.... అదృష్టాన్ని పరీక్షించుకోడానికి రేయీపగలనక తెగ కష్టపడి ప్రచారం చేసేస్తున్నారు.

ఈసారి బరిలో ఏడుగురు కోటీశ్వరులు ఉన్నారట. వీరుకాక 27 మంది ఆదాయపన్ను చెల్లించే స్థాయిలో అభ్యర్థులు పోటీలో నిలిచారు. డబ్బులున్నంత మాత్రన ఓట్లు రాలి పడవు కదండీ... అందుకే వీరంతా ఉదయాన్నే... ***పోరా శ్రీమంతుడా... పో పోరా శ్రీమంతుడా... నీదూ లక్ష్యానికీ జయహో...*** అంటూ తమకు తాము భుజం తట్టుకుని ప్రచారానికి సిద్ధమైపోతున్నారు.

పలువురు రెబెల్స్ ఇంకా స్వతంత్రులుగా బరిలోనే నిలిచారు. ప్రచారం కూడా చేస్తున్నారు. ఇప్పటికీ పార్టీలు బుజ్జగించినా... హెచ్చరించినా వెనక్కి తగ్గడం లేదు. దీంతో పార్టీ, సంబంధిత డివిజన్లలో అభ్యర్థులకు ఆందోళన తప్పడం లేదు. ***ఆడించి అష్టాచమ్మా... ఓడించకయ్యా... నీ పంట పండితే ఎట్లా!...*** అంటూ రెబెల్స్‌ను బతిమాలుతునే ఉన్నారు.

ఇలా రోజురోజుకు ఉత్కంఠతో ప్రచారం ముందుకు సాగిపోతోందండి. నగరంలో చిరుజల్లులు కాస్త ఇబ్బంది పెడుతున్నా, అభ్యర్థులు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మళ్లీ విశేషాలతో కార్పొరేషన్ ఎఫ్‌ఎంలో రేపు కలుద్దాం.

–మీ తోటరాముడు

ఓటంటే పచ్చనోటు కాదు...

సుందర ప్రశాంత తీరప్రాంత ఒడ మన కాకినాడ
కనువిందు చేయు మనోహర దృశ్యమాలికల జాడ
ప్రణాళికాబద్ధ నిర్మాణమునయ్యె కోకెనాడ
స్వాతంత్ర్య సమరశంఖములు పూరించెరిచట
మన కాకినాడ నగరపాలక ఎన్నికల సమయమాసన్నమయ్యె
నీతివంతులనెన్నుకొనగ ఉరకలెత్తవలె యువత
నగర ఘన చరితను నిలుపగ మోసులెత్తవలె విజ్ఞత
కుల.. మత.. మత్తు.. ధన ప్రలోభపు ఓట్లు
ప్రజాస్వామ్యానికే తూట్లు
మాన్యుల ఎన్నుకొనగ సామాన్యుల వజ్రాయుధమేఓటు
ఒక్కరోజు ఉదాసీనత అయిదేళ్ల కడగండ్లని గుర్తించవోయి
మార్పుకోరే తీర్పునివ్వగ స్ఫూర్తి జ్వాలలు రగిలించవోయి
నిజ ప్రజా సేవకుల నెన్నుకొనగ కదంతొక్కి కదలవోయి
ఓటంటే అంగడి సరకు కాదని కనువిప్పు కలిగించవోయి
ఓటంటే బంగరు భవితకు బాటని చాటవోయి
నిజ ప్రజా సేవకే నేను సైతమను
మన నగరనాయక తరుణీమణిని ఎన్నుకునే తరుణమిదే



-శ్రీనివాస్, కాకినాడ

రారండోయ్... వేడుక చేద్దాం

ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నగరపాలక సంస్థ పాలకవర్గం కొలువు దీరనుంది. నగరంలో ఎక్కడ చూసినా ఇదే సందడి. ఇందులో నగర వాసులుగా మీ భాగస్వామ్యమే ప్రధానం. ఓటు హక్కు మీరు వినియోగించుకోవడమే కాదు... హక్కు ఉన్న ప్రతి వ్యక్తీ వినియోగించుకునేలా ఉత్సాహం కలిగించాలి. ఆలోచన రేకెత్తించాలి. అందుకు మీరు చేయాల్సిందల్లా ఒక్కటే... మంచి నినాదాలు... చక్కటి కవితలు... కాకినాడ గత వైభవాన్ని చాటే ఫొటోలు (చిత్రాలు)... ఏమున్నా మాకు పంపండి. అందులో బాగున్నవి ప్రచురిస్తాం.

మా చిరునామా: **కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు**
ఈనాడు కార్యాలయం, హుకుంపేట, రాజమహేంద్రవరం
ఈ మెయిల్ ఐడీ: egdesk@eenadu.net

గాంధీబొమ్మ... పేరిలా వచ్చిందమ్మా



గాంధీజీ సమావేశం నిర్వహించిన ప్రాంతం గాంధీ బొమ్మ సెంటర్

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ప్రజలను చైతన్య పరుస్తూ ఆనాడు మహాత్మాగాంధీ దేశవ్యాప్తంగా తిరిగారు. అందులో భాగంగా 1922లో తొలిసారి జాతిపిత కాకినాడ వచ్చారు. అలా మహాత్మాగాంధీ నగరంలోని పలు ప్రాంతాలను సందర్శిస్తూ ఈ ప్రాంతంలో సమావేశంలో పాల్గొని మాట్లాడారని నాటి పెద్దలు చెబుతారు. అలా గాంధీజీ నడిచిన నేలలో... ఆయన సమావేశంలో పాల్గొన్న ప్రాంతం సెంటర్‌లో మహాత్మా గాంధీజీ పాలరాతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీన్నే గాంధీ బొమ్మ సెంటర్‌గా పిలుస్తారు.

–న్యూస్‌టుడే, గాంధీనగర్



గెలుపే సంకల్పం తెదేపా మహాసంకల్పం భారీ జెండాను చేతపట్టి 45వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న తెదేపా అభ్యర్థి కర్రి శైలజ



వెయ్.. దరువేయ్ నాగన్నా 2వ డివిజన్‌లో డప్పు కొడుతూ ఇంటింటా ప్రచారం చేస్తున్న సీపీఎం అభ్యర్థి తిరుమలశెట్టి నాగేశ్వరరావు



మేడ మీద ఓటరు మారాజుకు కోటిదండాలు
35వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి రేలంగి సత్యనారాయణరావు ప్రచారం



బరువూబాధ్యత నాది... ఓటు సాయం నీదే: నీళ్ల బిందెను ఎత్తి ఓట్లు అభ్యర్థిస్తున్న పదో డివిజన్ వైకాపా అభ్యర్థి దాసరి సూర్యనారాయణమ్మ



హారతి గైకొనుమా: 34వ డివిజన్ చిన్నవీధిలో ప్రచారం చేస్తున్న విజయసాయిరెడ్డి, నటుడు విజయచందర్‌కు హారతిస్తున్న మహిళ



కప్పు... సాసర్.. మీ మెప్పు పొందాలి
29వ డివిజన్లో స్వతంత్ర అభ్యర్థి యాళ్ల పట్టాభిరామయ్య ప్రచారం



సరికొత్త సైకిల్ హారం: సైకిల్ గుర్తును మెడలో వేసుకొని విజయకేతనం చూపుతున్న తెదేపా కార్యకర్త



ఎదుటివారిని చూసి ప్రేమ పూర్వకంగా నవ్వగలిగితే అదే మనం వారికిచ్చే అందమైన బహుమతి

– మదర్ థెరెసా

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Produce = ఉత్పత్తిచేయు
- మధుకరం = తుమ్మెద


సరదా పదాలు

ఆధారాలతో తెలుగు పదాలు రాయండి

1. Summer	వే ☐☐	5. Pay	వే ☐☐
2. Flute	వే ☐☐	6. God	వే ☐☐
3. Speed	వే ☐☐	7. Function	వే ☐☐
4. Heat	వే ☐☐	8. Dawn	వే ☐☐

- డీ దయామతి, హన్మకొండ

దారేది?



చుట్టూ జంతువులు... మధ్యలో మనం!



హాయ్ నేస్తాలూ! బాగున్నారా? నేనీమధ్య ఓ జూ కాని జూకెళ్లొచ్చా. ఊపిరి బిగబట్టుకుని కాలం గడిపొచ్చా. తలుచుకుంటేనే ఈ పర్యటన ఎంతో వింతగా.. గమ్మత్తుగా.. అనిపిస్తోంది. ఆ భలే భలే విశేషాలన్నీ మీతో పంచుకోకుంటే ఎలా? అందుకే ఇలా వచ్చేశా.



చిన్నూ కబుర్లు

చుట్టూ పులులు తిరుగుతుంటే మధ్యలో కూర్చుని భోజనం చేశా. సింహం దగ్గరగా వస్తుంటే కాలు మీద కాలేసుకుని ఐస్‌క్రీంలు తింటూ ఆనందించేశా. జంతువులన్నీ భయంకరంగా అరుస్తుంటే రాత్రివేళ మెత్తని పక్కపై పడుకుని ఓ కునుకేసేశా. 'కోతల రాయుడు కోతలు కోస్తున్నాడు. అన్నీ అబద్ధాలే' అనుకుంటున్నారా? అదేం కాదు. ఇదంతా నిజంగా నిజమే.

* మామూలుగా మనం ఎప్పుడైనా జూకి వెళ్లామనుకోండి. జంతువులన్నీ బోనుల్లో ఉంటాయి. మనం బయట స్వేచ్ఛగా తిరుగుతూ వాటిని చూస్తుంటాం. అంతేకదూ!

* మరి నేనెళ్లిన చోటు మాత్రం దీనికి పూర్తిగా భిన్నం. యూకేలోని కెంట్ దగ్గరుందిది.

* ఓ అద్దాల ఇంట్లో తలుపులేసుకుని నేనుంటే ఆ బయట అంతా పులులు, బోలెడు అడవి జంతువులూ తిరుగుతున్నాయి. లోపల నుంచి దగ్గరగా వాటిని చూస్తూ నేను ఆనందించేసానన్నమాట. ఒక్కసారైతే నేనున్న అద్దం దగ్గరకి పెద్ద పులి వచ్చేసింది. అప్పుడు చాలా భయమేసి పక్క గదిలో ఉన్న అమ్మ దగ్గరికి పరిగెట్టేశా.

* అసలు ఈ చోటు ఏంటంటే..? ఇదో సఫారీ. మొత్తం 600 ఎకరాల్లో చిక్కగా చెట్లుంటాయి. వాటిలో రకరకాల జంతువులు స్వేచ్ఛగా తిరుగుతుంటాయి.

* మామూలుగా సఫారీల్లో వీటిని చూసేందుకు మనల్ని జీపుల్లాంటివాటిపై ఎక్కించుకుని తిప్పి తీసుకొస్తారంతే. ఇక్కడ అదొక్కటే కాకుండా అద్దాలతో ఉన్న ఓ చక్కని ఇల్లుంది. దాంట్లో రెండు పడకగదులు, వంటిల్లు, హాలూ ఉన్నాయి. ఎవరైనా అద్దెకు తీసుకుని కొన్ని రోజులక్కడ బస చేయొచ్చు. నాలా వింత అనుభవాల్ని ఆస్వాదించొచ్చు. కావాలంటే మీరూ ఓసారి వెళ్లిరండి మరి. బైబై.

నవ్వుల జల్లులు!

టీచర్: రాముా! ఎన్ని సార్లు పిలుస్తున్నా పలకవేంటి?

రాము: మీరే కదా టీచర్ అనవసరమైన విషయాలు పట్టించుకోవద్దన్నారు!

టీచర్: 30 + 30 ఎంత అవుతుంది?

రఘు: ఆరు టీచర్...

టీచర్: కాస్త బుర్ర పెట్టి చెప్పు!

రఘు: నా జవాబు సరైనదే టీచర్. 0కి విలువ లేదని మీరే కదా చెప్పారు!


- బరాటం రామారావు, నిజామాబాద్

చిలిపి ప్రశ్న

నీళ్లు ఎందుకు తాగుతాం?

- జీ రమేష్, పెనుబర్తి

ఏది భిన్నం?



పరివర్తన

కథ

'నాన్నా! రేపు మా తరగతిలోని పిల్లలంతా పరీక్ష ఫీజు చెల్లించాలని హెడ్మాస్టారు చెప్పారు.' ఇంట్లోకి అడుగు పెడుతూనే అన్నాడు రఘు.

అప్పుడే కూలి పని ముగించుకుని ఇంటికి వచ్చిన కేశవులు కొడుకు మాటలు విని 'అలాగా! ఫీజు ఎంతేమిటి?' అని అడిగాడు.

రెండు వందలని మెల్లగా చెప్పాడు రఘు.

'అవునా! రెండు వందలా? ఈ సారి బాగా పెంచేశారే! సర్లే. రేపు బడికి వెళ్లేప్పుడు ఇస్తాలే' అంటూ పెరట్లోకి నడిచాడు కేశవులు.

మరుసటి రోజు ఉదయం రఘు బడికి వెళ్లేందుకు తయారవుతుండగా కేశవులు అతని వద్దకి వచ్చి 'ఇదిగోరా రెండు వందలు. జాగ్రత్త మరి. వెళ్లగానే టీచరుకి ఇవ్వు'. అంటూ జేబులో డబ్బులు పెట్టాడు. 'సరే నాన్నా!' అంటూ బయటకు నడిచాడు రఘు. రఘు కాస్తంత దూరం నడవగానే అతని స్నేహితుడు అమర్ ఎదురయ్యాడు.


'ఏరా మీ నాన్న ఫీజు డబ్బులిచ్చారా?' ఆత్రుతగా అడిగాడు అమర్.

'ఇచ్చార్రా. మరి మీ నాన్నా?' అమర్ కళ్లలోకి సూటిగా చూస్తూ అడిగాడు రఘు.

'నేను ఫీజు రెండు వందల యాభై రూపాయలని చెబితే మారు మాట్లాడకుండా ఇచ్చేశార్రా మానాన్న' గొప్పగా చెప్పాడు అమర్.

ఇంతకీ అసలు విషయం ఏమిటంటే వాళ్లు చెల్లించవలసిన ఫీజు వంద రూపాయలే. తమ తల్లిదండ్రుల నుంచి ఎక్కువ డబ్బు తీసుకుని, వాటితో సినిమాకి వెళ్లాలని పథకం వేసుకున్నారు రఘు, అమర్. ఇద్దరిదీ ఒకే తరగతి. ఒకే బెంచీలో కూర్చుంటారు. కలసి తిరుగుతుంటారు. తల్లిదండ్రుల్ని నమ్మించి భలేగా డబ్బులు తీసుకున్నామని ఇద్దరూ మురిసిపోయారు. చెరో వంద వారి తరగతి ఉపాధ్యాయుడికి ఫీజు చెల్లించారు.

మరునాడు ఆదివారం కావడంతో ఇద్దరూ ఆడుకోవడానికి వెళుతున్నామని చెప్పి టౌనుకు బయలుదేరారు. సినిమా చూసి, ఆ తర్వాత మిఠాయి దుకాణానికి వెళ్లి తమకు ఇష్టమైన తినుబండారాలెన్నో కొనుక్కుని తిన్నారు. ఆనందంగా గడిపారు. చీకటి పడే వేళకు ఇంటికి చేరుకున్నారు. రఘు ఆట నుంచి ఇంటికి వస్తున్నట్లుగా నమ్మించేందుకు ఒక క్రికెట్ బ్యాటు చేతిలో పట్టుకుని



మెల్లగా ఇంట్లోకి అడుగు పెట్టాడు. అదే సమయంలో పక్క గదిలో తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న మాటలు విని ఆగిపోయాడు. కిటికీలోంచి లోపలికి చూశాడు. మంచం మీద కేశవులు జ్వరంతో వణికిపోతూ ఉన్నాడు. అతని భార్య సపర్యలు చేస్తూ 'వచ్చిన కూలి డబ్బులన్నీ పిల్లాడి ఫీజు కోసం ఇచ్చేశావు. మందులు తెద్దామంటే ఇంట్లో రూపాయి కూడా లేదు' అంది. అందుకు కేశవులు 'సమయానికి ఫీజు కట్టకపోతే రఘును పరీక్షలకు అనుమతించరు. నాకు మామూలు జ్వరమేగా వచ్చింది. రేపటికి తగ్గిపోతుందిలే' అన్నాడు మూలుగుతూ.

'అలా అంటే ఎలా? నేను పక్కింటి వాళ్ల దగ్గరకెళ్లి ఓ యాభై రూపాయలు అడిగి మందులు కొని తెస్తాను' అంటూ లేవబోయిన ప్రమీల చేయి పట్టుకుని ఆపి 'నా మాట విను రేపు చూద్దాంలే. ఇప్పుడు అప్పు చేయడం ఎందుకు?' అన్నాడు కేశవులు.

అదంతా చూస్తున్న రఘుకు బాధగా అనిపించింది. తన విలాసాల కోసం ఖర్చు చేసిన ఆ వంద రూపాయలు ఎంత విలువైనవో తెలిసి వచ్చింది. అదీగాక రోజు వారీ కూలికి వెళ్లి డబ్బు సంపాదించే తన తండ్రి శ్రమ విలువను అర్థం చేసుకోలేకపోయానని బాధపడ్డాడు. తన ఫీజు కోసం ఉన్న డబ్బులన్నీ ఇచ్చిన తండ్రి మంచితనాన్ని తలుచుకోగానే దుఃఖం తన్నుకు వచ్చింది. గదిలోకి పరుగున వెళ్లి తండ్రిని అమాంతం కౌగిలించుకున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తూ జరిగిన సంగతంతా చెప్పాడు. తన తప్పును క్షమించమని విలపించాడు. వాస్తవాన్ని చెప్పినందుకు రఘును తల్లిదండ్రులు కోపగించుకోలేదు. పైగా 'చూడు రఘూ! నువ్వే మా సర్వస్వం. నీ కోసం, నీ చదువు కోసం ఏమైనా చేస్తాం. నువ్వు మాలా కూలి బతుకు బతక కూడదన్నదే మా కోరిక. జరిగింది మరిచిపో. చేసిన తప్పు తెలుసుకున్నావు కదా. అదే చాలు. ఇక మీదట నీకేం కావాలన్నా సంకోచం లేకుండా మమ్మల్ని అడుగు. మేం తెచ్చిపెడతాం. మళ్లీ ఇలాంటి పొరపాటు చేయకు' అంటూ అక్కున చేర్చుకున్నారు. ఆ ఘటన రఘులో గొప్ప మార్పు తెచ్చింది. ఎప్పుడూ మంచి ప్రవర్తనతో మెలుగుతూ, తన మిత్రుడిలోనూ అలాంటి పరివర్తన తీసుకొచ్చాడు.

- పెండెం జగదీశ్వర్

జవాబులు: ఏది భిన్నం: a చిలిపిప్రశ్న: తినలేం కాబట్టి! సరదా పదాలు: 1. వేసవి 2. వేణువు 3. వేగము 4. వేడిమి 5. వేతనం 6. వేలుపు 7. వేడుక 8. వేకువ

ఫొటో ఓటరు స్లిప్‌లు సిద్ధం

నేటి నుంచి ఇంటింటికి పంపిణీ

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోటానికి ఫొటో ఓటరు స్లిప్‌లు సిద్ధం చేశారు. గతంలో ఆయా రాజకీయ పార్టీలు ఫొటో ఓటరు స్లిప్‌లను ఇచ్చేవి. అధికారులే ఓటు వేయటానికి వినియోగించే ఫొటో ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించారు. దీంతో డివిజన్ల పరిధిలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలు తెలియజేసే స్లిప్‌లను పంపిణీ చేయటానికి సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఆదివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో బూత్‌స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ అర్బన్ తహసీల్దారు బాలసుబ్రమణ్యం, ఎన్నికల ఉప తహసీల్దారు రమేశ్, నగరపాలక సంస్థ మేనేజరు కర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో వీటిని బూత్‌స్థాయి అధికారులకు అందజేశారు. మొత్తం 48 డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. వీటి పరిధిలో 196 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 2.28 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికీ ఫొటో ఓటరు స్లిప్‌లు అందించటానికి చర్యలు చేపడుతున్నారు. సోమవారం నుంచి ఇంటింటికి వెళ్లి వీటిని పంపిణీ చేయనున్నారు. స్లిప్‌లో ఓటరు ఫొటో, పోలింగ్ కేంద్రం, వరుస నంబరు దీనిలో నిక్షిప్తం చేశారు. ఓటరు సులభంగా తన ఓటు హక్కును వినియోగించుకోటానికి అవకాశం ఉంటుంది. ఓటర్లు వీటిని బూత్‌స్థాయి అధికారుల నుంచి పొందాలని నగరపాలక సంస్థ అధికారులు కోరారు.

కాకినాడ నగరపాలక సంస్థ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు

డివిజన్	తెదేపా/ భాజపా	వైకాపా	కాంగ్రెస్/ వామపక్షాలు
1	పేరాబత్తుల లోవబాబు	వాసిరెడ్డి సూరిబాబు	టి.సత్యఅనంతలక్ష్మి (కాంగ్రెస్)
2	కాళా భీమశంకర సత్తిబాబు	సంగిశెట్టి జాహ్నవి	పి.యుగ్మావతి (కాంగ్రెస్) టి.నాగేశ్వరరావు (సీపీఎం)
3	గుత్తుల అచ్చియమ్మ	గుర్రాల వెంకటేష్	
4	తోట నాగలక్ష్మి (భాజపా)	పలక సూర్యకుమారి	
5	నల్లబిల్లి సుజాత (భాజపా)	కరుసూరి సరోజ	
6	బండి సత్యనారాయణ	అమలదాసు చిరంజీవి	
7	అంబటి క్రాంతి	నురుకుర్తి భ్రమరాంబ	
8	వడ్డూరి వరలక్ష్మి	చిట్నీడి సత్యవతి	టి.కమలకుమారి (సీపీఐ)
9	వై.మాలకొండయ్య (భాజపా)	కంపర రమేష్	కె.శ్రీనివాసరావు (కాంగ్రెస్) పి.సత్యనారాయణ (సీపీఐ)
10	మోసా దాసమ్మ	దాసరి సూర్యనారాయణమ్మ	
11	గద్దేపల్లి దానమ్మ	మెర్ల వరలక్ష్మి	బి.నాగమణి (కాంగ్రెస్)
12	తుమ్మల సునీత	బొదిరెడ్ల పుష్ప	
13	వమ్మి బాలకామేశ్వరరావు	మహమద్ జమాల్‌ఆస్కర్	కె.సోమశేఖర్ (కాంగ్రెస్)
14	వనమాడి ఉమాశంకర్	అంకాడి సత్తిబాబు	
15	అరదాడి శివ	పినపోతు సత్తిబాబు	
16	మల్లాడి గంగాధరరావు	పేర్ల జోగారావు	కోనాడ పద్మావతి (కాంగ్రెస్)
17	చోడిపిల్లి వెంకటసత్యప్రసాద్	అర్జిల్ల వీరవెంకట సత్యవిజయ్	
18	చవ్వాకుల రాంబాబు	కోనాడ సత్యనారాయణ	
19	పలివెల రవిఅనంతకుమార్	సిద్ధాంతపు రాజు	
20	కొప్పనాతి నాగసత్యనారాయణ	పెసంగి మోహనరావు	జి.సీతారామకృష్ణ (సీపీఎం)
21	సుల్తానా బేగం	బొర్రా విజయకుమారి	
22	వనమాడి శివప్రసాద్	మల్ల గణకృష్ణకుమార్	ఎం.సత్యనారాయణ (కాంగ్రెస్)
23	గుత్తుల జగదాంబ	మీసాల శ్రీదేవి	జ్యోతిభవానీ (కాంగ్రెస్)
24	డోకుబుర్ర భద్రం	మీసాల ఉదయ్‌కుమార్	బి.లత (కాంగ్రెస్)
25	కామాడి సీత	బత్తిన చినతల్లి	
26	సంగాని నందం	మచ్చా లోకేష్ వర్మ	
27	రాజాన మంగారత్నం	వరిపిల్లి వెంకటరమణమ్మ	
28	సుంకర పావని	వాసిరెడ్డి వరలక్ష్మి	
29	చిట్నీడి శ్రీనివాసు (భాజపా)	సిరియాల చంద్రరావు	
30	బాదం బాలకృష్ణ	రాగిరెడ్డి చంద్రకళాదీపిక	
31	బంగారు సత్యవతి	బంగారు ఆదిలక్ష్మి	కె.ఇందిర (కాంగ్రెస్)
32	రిక్కా లక్ష్మి	రోకళ్ల సత్యనారాయణ	ఎం.షాహిన్‌సుల్తానా (కాంగ్రెస్)
33	గుజ్జు దుర్గ	బోర అరుణ	
34	తహేరా ఖాతూన్	పసుపులేటి వెంకటలక్ష్మి	
35	కె.ప్రసాద్‌రావు (భాజపా)	బెండ విష్ణుమూర్తి	ఆర్.సత్యనారాయణ (కాంగ్రెస్)
36	సాలగ్రామ లక్ష్మిప్రసన్న(భాజపా)	బెజవాడ దుర్గాదేవి	
37	లంకే హేమలత	కర్రి దేవిక	
38	మాకినీడి శేషుకుమారి	యార్లగడ్డ పద్మజ	పి.కోమలాదేవి (కాంగ్రెస్)
39	బీర కృష్ణప్రియ (భాజపా)	బాదం మంగారత్నం	ఎం.రామలక్ష్మి (కాంగ్రెస్)
40	సుంకర శివప్రసన్న	బసవ సత్యకుమారి	
41	గోడి సత్యవతి (భాజపా)	పెద్దిరెడ్డి రామలక్ష్మి	
43	జేడీ పవన్‌కుమార్	కోక వెంకటగిరి	
44	ఇమ్మిడిశెట్టి వెంకటరమణమ్మ	ఇంటి గంగారత్నం	
45	కర్రి శైలజ	తిరుమలశెట్టి మౌని	
46	కోరుమిల్లి బాలప్రసాద్	ర్యాలి రాంబాబు	ఎం.సాయిప్రకాష్ (కాంగ్రెస్)
47	గుంటూరు పద్మ (భాజపా)	రాజరపు వెంకటలక్ష్మి	జి.ప్రసన్నకుమారి (కాంగ్రెస్)
49	పాలిక ఉషారాణి	రామనాతి మురళి	
50	పలివెల వెంకటత్రిమూర్తులు	ఇజ్జాపురెడ్డి శ్రీనివాస్	పి.సతీష్ (కాంగ్రెస్)

నేడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పర్యటన

కాకినాడ నగరం: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేష్ కుమార్ సోమవారం కాకినాడలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకూ నగరంలో పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తారు. 10 గంటలకు కలెక్టరేట్‌లో గల విధాన గౌతమీ మందిరంలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు వెళతారు. 12 గంటల వరకూ పార్టీల నాయకులు, అభ్యర్థులతో సమావేశమై విజ్ఞాపనలు స్వీకరిస్తారు.



దేశంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతాం

ఉపముఖ్యమంత్రి చినరాజప్ప

కాకినాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆకర్షణీయ నగరం కాకినాడను గత మూడేళ్లలో ఎంతో అభివృద్ధి చేశాం. రాబోయే రెండేళ్లలో మరింత అభివృద్ధి చేసి దేశంలోనే అత్యుత్తమ ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దుతామని ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. కాకినాడ కార్పొరేషన్ 3వ డివిజన్‌లోని గోడారిగుంటలో తెదేపా అభ్యర్థి గుత్తుల అచ్చియమ్మకు మద్దతుగా ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, గుడా ఛైర్మన్ గన్ని కృష్ణలతో కలిసి చినరాజప్ప ఆదివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సురేష్‌నగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చినరాజప్ప మాట్లాడుతూ తెదేపా, భాజపా పొత్తుతో కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని, అన్ని డివిజన్లలో అభ్యర్థులు గెలిచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి ఇన్‌ఛార్జీలను నియమించినట్లు తెలిపారు. ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నట్లు, తెదేపా కార్యకర్తలు, నాయకులు రెట్టించిన ఉత్సాహంతో అభ్యర్థుల గెలుపు కోసం శ్రమిస్తున్నారని కష్టపడిన వారందరికీ భవిష్యత్తులో తగిన విధంగా గుర్తింపు నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, సీనియర్ నాయకులు ముళ్లపూడి రాంబాబు, డేగల రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఓటర్లకు అభివాదం చేస్తున్న చినరాజప్ప, ఎమ్మెల్యే అనంతలక్ష్మి

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

పార్టీ పర్యవేక్షకులకు యనమల సూచన

ఈనాడు, కాకినాడ

అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎన్నికల కమిటీలు పనిచేయాలని తెదేపా సీనియర్ నేత, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. ఆదివారం కాకినాడలోని తెదేపా జిల్లా కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉండడం వల్ల అన్ని డివిజన్లలో పోటీలో ఉన్న అభ్యర్థుల విజయం కోసం పర్యవేక్షకులు పనిచేయాలని తెలిపారు. వివిధ డివిజన్లలో ఇన్‌ఛార్జులుగా, క్లస్టర్ స్థాయిలో సమన్వయకర్తలుగా ఉంటున్న వారు కొన్ని సమస్యలను చర్చకు తేవడంపై ఈ సందర్భంగా యనమల ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇది సాకులు వెతుక్కునేందుకు సమయం కాదని, ఎన్ని ఇబ్బందులు ఉన్నా పార్టీ తరపున పోటీలో ఉన్న వారిని గెలిపించే బాధ్యత మీపై ఉందని ఆయన స్పష్టం చేశారు. డివిజన్ స్థాయిలో కొన్ని చోట్ల అభ్యర్థులు డబ్బులు ఖర్చు చేయడంలో ఎదుర్కొంటున్న సమస్యలు, కార్యకర్తల మధ్య సమన్వయ లోపం, ప్రచారానికి సహకరించక పోవడం, ప్రజలను ఆకట్టుకునే విధంగా ప్రచారం చేయలేక పోవడం, ప్రచార సామగ్రి విషయంలో వెనుకంజలో ఉండడం వంటి సమస్యలను ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, దాట్ల సుబ్బరాజు, గొల్లపల్లి సూర్యారావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు నామన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి యనమల. చిత్రంలో మంత్రులు చినరాజప్ప, ప్రతిపాటి పుల్లారావు, తెదేపా జిల్లా అధ్యక్షుడు నామన

కాకినాడ నగరం: గత మూడేళ్లలో కాకినాడ నగరంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ రూపొందించిన 'ఇదిగో అభివృద్ధికి రుజువు' ప్రచార పత్రాన్ని మంత్రులు చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం ఆవిష్కరించారు. గడచిన మూడేళ్లలో నగరంలో చేసిన అభివృద్ధి వివరాలను ఉటంకిస్తూ ఈ పత్రాన్ని రూపొందించారు. ఆయా వార్డుల్లో ఈ పత్రాలను పంపిణీ చేసేందుకు వీటిని రూపొందించారు. కార్యక్రమంలో జిల్లా తెదేపా అధ్యక్షుడు నామన రాంబాబు, నగర, గ్రామీణ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పిల్లి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

అవినీతి తప్ప అభివృద్ధి పట్టని వైకాపా: బుచ్చయ్యచౌదరి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: వైకాపా నేతలకు అవినీతి తప్ప అభివృద్ధి కనిపించదని, అందుకే వారు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని తెదేపా సీనియర్‌నేత, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గత పదేళ్లుగా కాంగ్రెస్ పాలనలో దోచుకుతిన్నారని, తాము అధికారంలోకి వచ్చిన మూడేళ్లకే ఎన్నో అభివృద్ధి పనులను పూర్తిచేశామన్నారు. కాకినాడ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం రాజోలు ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావుతో కలిసి బుచ్చయ్య చౌదరి విలేకరులతో మాట్లాడారు. పట్టిసీమ ద్వారా కృష్ణాడెల్టాకు సాగు, తాగునీరందిస్తున్న ఘనత తెదేపాదన్నారు. పురుషోత్తమపట్నం ద్వారా ఏలేరు ఆయకట్టుకు సాగునీరందిస్తున్నామన్నారు. చంద్రన్న బీమా ద్వారా అసంఘటిత కార్మికుల కుటుంబాల్లో యజమాని మరణిస్తే వెంటనే రూ.5 వేలు, 20 రోజుల తరువాత మరో రూ.25 వేలు ఇంటికెళ్లి ఇస్తున్నారన్నారు. ఇన్ని జరుగుతుంటే గత మూడేళ్లలో ఏమీ జరగలేదని వైకాపా నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని బుచ్చయ్య మండిపడ్డారు. నిత్యం అభివృద్ధిని కాంక్షిస్తున్న చంద్రబాబు సోమవారాన్ని పోలవరానికి కేటాయిస్తే, అవినీతి ఊబిలో కూరుకుపోయిన ప్రతిపక్షనేత జగన్ శుక్రవారాన్ని కోర్టుకు కేటాయించుకున్నారని బుచ్చయ్య ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో భూములు దోచుకుని అధర్మాన ప్రసాదరావుగా పేరుతెచ్చుకున్న వ్యక్తి కూడా విమర్శలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. అక్రమార్జన కేసుల్లో ఏ1, ఏ2గా ఉన్న జగన్, విజయసాయిరెడ్డిలు నంద్యాల, కాకినాడ ఎన్నికలకు నాయకత్వం వహిస్తున్నారంటూ బుచ్చయ్య విమర్శలు గుప్పించారు. కాకినాడ అభివృద్ధి తెదేపా హయాంలోనే జరిగిందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బోళ్ల కృష్ణమోహన్, మందాల గంగసూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

వినాయక చవితి నిర్వాహకులకు పోలీసుల సూచనలు

కాకినాడ క్రైం, న్యూస్‌టుడే: వినాయక చవితి నిర్వాహకులకు పోలీసులు పలు సూచనలు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ విశాల్‌గున్ని చవితి నిర్వహణపై ఆదివారం పలు సూచనలు వెల్లడించారు. నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

- విగ్రహం ఏర్పాటు, పందిళ్ల నిర్మాణంపై పోలీస్ శాఖతో పాటు మున్సిపల్, విద్యుత్తు శాఖల అనుమతులు తప్పక పొందాలన్నారు.
- ఉత్సవ కమిటీ సభ్యుల ఫోను నెంబర్లను తప్పక స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. నిత్యం పందిరి వద్ద నిర్వహిస్తున్న పూజా విధానాన్ని గమనిస్తూ ఎటువంటి షార్టు సర్క్యూలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు వహించాలన్నారు.
- ఉత్సవ నిర్వాహకులు చందాల పేరుతో రహదారులపై వెళ్లే వాహనదారులను ఇబ్బందులకు గురిచేయడం, ఇతర మతస్థుల మనోభావాలు దెబ్బతినే చర్యలకు పాల్పడడం చేయరాదన్నారు.
- నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు, మైక్ వాడకానికి తప్పకుండా డీఎస్పీ అనుమతి పొందాలన్నారు.
- నిమజ్జనం సమయంలో వివిధ రకాల బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు అనుమతించమన్నారు. మైక్ శబ్దం 10 డెసిబెల్స్‌కు మించరాదన్నారు. అసభ్యకర పాటలు, నృత్యాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పండుగను ఆహ్లాదంగా జరుపుకోవాలని సూచించారు.

అత్తను హతమార్చిన అల్లుడు

అప్పుల పాలై ఆస్తి కోసం అఘాయిత్యం

రాజానగరం(గ్రామీణం), న్యూస్‌టుడే: అప్పుల పాలైన ఓ వ్యక్తి తన అత్తగారిని చంపితే ఆమెకు ఉన్న ఆస్తి సొంతమవుతుందని భావించి పథకం ప్రకారం హతమార్చాడు. రాజమహేంద్రవరం గ్రామీణ మండలం కోలమూరులో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 9వ తేదీన కోలమూరుకు చెందిన జాగు సత్యనారాయణ తన భార్య జాగు కాత్యాయని(51) బంగారం తాకట్టు పెట్టడానికి వెళ్లి తిరిగిరాలేదని రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూర్పు మండల డీఎస్పీ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సీఐ వరప్రసాద్, ఎస్ఐలు రాజేష్, జగన్‌మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ నెల 19వ తేదీన కాత్యాయని అల్లుడు రత్నరాజు, అతని స్నేహితుడు చెరుకూరి అనిల్‌కుమార్‌తో కలిసి ఆమెను తామే హత్యచేశామంటూ కోలమూరు వీఆర్వో చెక్కా చంద్రకాంతం వద్ద లొంగిపోయారు. వీఆర్వో నివేదిక తయారు చేసి పోలీసులకు అందించారు. ఈ నేపథ్యంలో ఆదివారం డీఎస్పీ నిందితులను అదుపులోకి తీసుకుని విచారించి విలేకర్లకు వివరాలను వెల్లడించారు. అత్తగారిని చంపేస్తే ఆమె ఆస్తి తన సొంతమవుతుందని దాంతో అప్పులు తీరుతాయని భావించి ఈ పని చేశానని రత్నరాజు పోలీసుల ఎదుట అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. మరో నిందితుడు చెరుకూరి అనిల్‌కుమార్‌తో కలిసి ఈ నెల 9వ తేదీ సాయంత్రం కాత్యాయనిని సంప్రదించాడు. తక్కువకు రేటుకు స్థలం ఉందని పెట్టుబడి తానే భరిస్తానని, స్థలం చూపిద్దామని అత్తగారిని నమ్మించి కారులో ఎక్కించుకుని గామన్ వంతెన నుంచి కాతేరు తోటల్లోకి తీసుకెళ్లారు. అక్కడ రత్నరాజు ఆమె గొంతు నులిమిచంపాడు. మధ్యలో ఆమె కేకలు వేయగా అనిల్‌కుమార్ ఆమె నోరు మూసివేశాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు పుస్తెలతాడు, చెవి దుద్దులు, రెండు ఉంగరాలు, నల్లపూసల తాడు, చేతి గాజులు, బ్యాగులోని రూ.2,700 నగదు తీసుకుని మృతదేహాన్ని గామన్ వంతెనపై నుంచి గోదావరిలోకి పడేశారు. అపహరించిన బంగారు ఆభరణాలను ఇద్దరూ పంచుకుని అక్కడి నుంచి పరారయ్యారు. వీరిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. అయితే మృతదేహం ఇప్పటి వరకూ లభ్యం కాలేదని, ఎక్కడైనా కనిపిస్తే సమాచారం అందించాలని రాజానగరం పోలీసులు కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న తూర్పుమండల డీఎస్పీ రమేష్‌బాబు

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

నడకుదురు(కరప): కరప మండలం నడకుదురులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. పెదపూడి మండలం శహపురం గ్రామానికి చెందిన రైతు యాళ్ల సుబ్బారావు ఆదివారం పనిమీద ద్విచక్ర వాహనంపై కాకినాడకు వెళుతుండగా నడకుదురులోని యోగా కేంద్రం వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావు తలకు తీవ్రగాయాలై అపస్మారక్మస్థితికి చేరుకున్నారు. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించి క్షతగాత్రుడిని 108లో కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ వ్యక్తిని 108లో ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట, న్యూస్‌టుడే: అనారోగ్యం కారణంగా ఒక వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సామర్లకోట వీర్రాఘవపురానికి చెందిన గుణ్ణం శ్రీనివాసు(61) ఆదివారం రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాసు స్థానిక పిఠాపురం రోడ్డులో చుట్టలు చుట్టే కార్మికుడుగా పనిచేస్తున్నాడు. నాలుగేళ్లుగా టీబీతో బాధపడుతున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన శ్రీనివాసు సాయంత్రం ఇంటికి రాలేదు. ఆదివారం తెల్లవారు జామున ఐదు తూముల వద్ద విశాఖపట్నం వైపు వెళ్లే పట్టాలపై మృతదేహం పడి ఉంది. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు రైల్వే జీఆర్పీ హెచ్‌సి విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుణ్ణం శ్రీనివాసు

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తునిపట్టణం, న్యూస్‌టుడే: తుని రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో బయ్యవరం- నర్సీంగపల్లి మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని ఒక వృద్ధుడు మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ సింహాచలం ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం మృతుడి ఒంటిపై ఎరుపురంగు టీషర్టు, ఆకుపచ్చ రంగు లుంగీ ఉన్నాయి. నడుముకు తువాలు చుట్టుకుని ఉన్నాడు. మృతుడు విశాఖ జిల్లా యలమంచిలి, కొంకోట ప్రాంతాలవాడై ఉంటాడని రైల్వే పోలీసులు భావిస్తున్నారు.



వృద్ధుడి మృతదేహం

అందరూ ఉండి అనాథగా మృతి చెందిన వృద్ధురాలు

రాజానగరం, న్యూస్‌టుడే: ఊరు కాని ఊరిలో బంధువుల నిర్లక్ష్యానికి గురై అనాథగా మృతి చెందింది ఆ వృద్ధురాలు. కనుమరుగవుతున్న మానవీయ విలువలకు అద్దం పట్టే సంఘటన ఇది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం కర్లం గ్రామానికి చెందిన కొమ్మూరి నాగమ్మను ఈ నెల రెండో తేదీన బంధువులు రాజానగరం సాయిబాబా ఆలయం వద్ద వదిలి వెళ్లారు. వయోభారంతో చిక్కి శల్యమై, నడవలేని స్థితిలో ఉన్న ఆ వృద్ధురాలిని వైకాపా నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి సహకారంతో, సాయిబాబా ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఆదరించి రాజమహేంద్రవరం గౌతమీ జీవకారుణ్య సంఘంలో చేర్పించారు. 18 రోజుల అనంతరం ఆమె ఆదివారం మృతి చెందిందని, గౌతమీ జీవకారుణ్య సంఘం వారు సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. దాంతో కమిటీ సభ్యులు జీవకారుణ్య సంఘానికి బయలుదేరి వెళ్లారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేసి, ఆమె ఖనన ఖర్చులకు కొంత నగదును అందజేసి బరువెక్కిన హృదయాలతో బయటకు వచ్చారు.

నా భర్తను అక్రమంగా నిర్బంధించి కొట్టారు

పెదపూడి ఎస్ఐపై ఓ మహిళ ఆరోపణ

కాకినాడ క్రైం, న్యూస్‌టుడే: తన భర్తను అక్రమంగా నిర్బంధించి విచక్షణారహితంగా కొట్టి గాయపరిచిన పెదపూడి ఎస్ఐతో పాటు సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన పంపన లోవమణి అనే మహిళ డిమాండ్ చేశారు. తీవ్ర గాయాలపాలైన భర్త పంపన కనకారావును మెరుగైన చికిత్స కోసం గ్రామస్థులు, బీసీ నేతల సహకారంతో ఆదివారం కాకినాడ ప్రభుత్వ సామాన్యాసుపత్రి(జీజీహెచ్)లో చేర్పించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నెల రోజుల క్రితం ఓ వ్యక్తికి చెందిన చేపల చెరువులో విషప్రయోగం జరిగిందని, దీనికి తన భర్తే కారణమని సంబంధిత వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. ఫిర్యాదు ఆధారంగా కుటుంబ సభ్యులకైనా కనీస సమాచారం ఇవ్వకుండా తన పరిధిలోనికి రాని నడకుదురు గ్రామం నుంచి పెదపూడి ఎస్ఐ, బృందం ఈ నెల 18న పొలం నుంచి వస్తుండగా తన భర్తను బెదిరించి, జీపులో తీసుకెళ్లారని ఆమె ఆరోపించింది. అక్కడ్నుంచి పెదపూడి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టడంతో తన భర్త గాయాలపాలయ్యాడని చెబుతోంది. భర్త ఆచూకీ లభించక కరప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశారని తెలిపింది. స్థానికులు కనకారావును పోలీసులు జీపులో తీసుకెళ్లడం తాము చూశామని చెప్పడంతో తిరిగి కరప పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించానని, గంట వ్యవధిలో నీరసించి రక్తమోడుతున్న తన భర్తను పెదపూడి పోలీసులు జీపులో కరప పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారని తెలిపింది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పెదపూడి ఎస్ఐ కిషోర్‌బాబుతో పాటు సహకరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. బాధితుని భార్య లోవమణి ఫిర్యాదు మేరకు జీజీహెచ్ ఔట్‌పోస్ట్ పోలీస్ స్టేషన్‌లో మెడికల్ లీగల్ కేసు నమోదైంది.



డీఎస్పీకి వినతి పత్రం అందిస్తున్న బీసీ నేతలు

డీఎస్పీకి వినతి

పెదపూడి ఎస్ఐతోపాటు బాధితుడ్ని తీసుకెళ్లి అప్పగించిన కరప ఏఎస్ఐ, సహకరించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ ఉద్యమ నేత పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బీసీ నేతలు కాకినాడ ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావుకు విన్నవించారు. బాధితుడి భార్య డీఎస్పీకి వినతి పత్రం సమర్పించింది. తన పరిధికాని ప్రాంతంలో పెదపూడి ఎస్ఐ చొరవచూపడంలో ఆంతర్యాన్ని విచారణలో తేల్చాలని కోరింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదానికి గురైన వాహనదారుడిని అంబులెన్స్‌పై ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

గండేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ... రాజమహేంద్రవరం నుంచి జగ్గంపేట వైపు ద్విచక్రవాహనంపై వస్తున్న హరి మురారి గ్రామం వద్దకు వచ్చే సరికి సైకిల్‌పై వెళ్తున్న దుర్గారావును ఢీకొన్నాడు. ఈ సంఘటనలో దుర్గారావు తలకు బలంగా గాయాలవ్వగా హరి చేతులకు, తలకు చిన్న చిన్న గాయాలయ్యాయి. వీరిని రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.



తలకు గాయమైన దుర్గారావు

వ్యాన్..మోటారు సైకిల్ ఢీ

సామర్లకోట, న్యూస్‌టుడే: సామర్లకోట నవభారత్ వెంచర్స్ షుగర్ పరిశ్రమ వద్ద వ్యాన్, మోటారు సైకిల్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడపాడుకు చెందిన కె.శ్రీనివాస్ మేడపాడు నుంచి తుని మోటారు సైకిల్‌పై వెళుతున్నాడు. తుని నుంచి వెట్లపాలెం వెళుతున్న వ్యాన్, మోటారు సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. మోటారు సైకిల్‌పై వెళుతున్న శ్రీనివాస్ కాలుకు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆతనిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలానికి ట్రాఫిక్ ఎస్సై సతీష్ చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ మేరకు సామర్లకోట ఎస్సై శ్రీనివాస్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3 నుంచి జాతీయ గణిత పోటీలు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామానుజన్ గణిత అకాడమీ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి గణిత పోటీలు సెప్టెంబరు 3 నుంచి ప్రారంభమవుతాయని అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సంబంధిత బ్రోచర్‌ను కార్యదర్శి ఎం.నాగార్జునతో కలసి ఆయన విడుదల చేశారు. ఈ ఏడాది జరిగే 28వ జాతీయ స్థాయి గణిత పోటీల ప్రిలిమనరీ పరీక్ష సెప్టెంబరు 3న, తుది పరీక్ష నవంబరు 5న నిర్వహించాలని నిర్ణయించామన్నారు. 4వ తరగతి నుంచి ఎమ్మెస్సీ వరకు చదివే విద్యార్థులు అర్హులన్నారు. విద్యార్థులు గణిత శాస్త్రపరంగా సమస్యలు సాధించాలని కోరారు. అన్ని ప్రాంతాలకు ఇప్పటికే బ్రోచర్స్ పంపించామని, మరిన్ని వివరాలకు అకాడమీని సంప్రదించాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ ఏడాది డిసెంబరు 22న జరిగే గణిత దినోత్సవం నాడు బహుమతులు అందజేస్తామన్నారు. దీనికి అవసరమైన పుస్తకాలు రామచంద్రపురం రామానుజన్ గణిత అకాడమీలో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కె.వి.వి, నాగార్జున కోరారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సభ్యులు ఎం.సత్తిరాజు, ఉప్పలపాటి మాచిరాజు పాల్గొన్నారు.



బ్రోచర్ విడుదల చేస్తున్న సత్యనారాయణ, తదితరులు

శాస్త్రీయ దృక్పథం అలవరచుకోవాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సత్యాన్ని అన్వేషిస్తూ శాస్త్రీయ దృక్పథంతో నడవడమే హేతువాదమని రాష్ట్ర హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలోని ఎన్జీవో హోంలో జరిగిన హేతువాద సంఘం వార్షికోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోరక్షకులుగా మతోన్మాదంతో మారణ హోమం సృష్టించడం సరికాదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చైతన్య శేఖర్ మాట్లాడుతూ గురజాడ చెప్పిన విధంగా మతాలన్నీ మాసిపోయినపుడే ప్రజలు వర్ధిల్లుతారన్నారు. మతం పేరుతో మారణ హోమం సృష్టించడం వల్ల జ్ఞానం సముపార్జించిన చోటే అజ్ఞానం పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పెన్మెత్స సుబ్బరాజు మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితం అజ్ఞానమనే అంధకారం నుంచి మనిషి జ్ఞానమనే వెలుగులోకి వచ్చాడని శాస్త్రీయ విజ్ఞానం బోధిస్తోందన్నారు. అనంతరం ఎ. ఆదినారాయణ, ఊట్ల రంగనాయకులు, పసల భీమన్న, ఎం.వి.రాజశేఖరవర్మ, ఆకేటి సూరన్న, తోరాటి వసంతరావు తదితరులు ప్రసంగించారు. ఉభయ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

క్షణాల్లో భిన్న వర్ణాలు

సంధ్యా సమయంలో... అహ్లాదకరమైన వాతావరణంలో.. ప్రశాంతమైన గోదావరిలో ప్రయాణిస్తే ఆ మజానే వేరు. గోదావరి రమణీయతను చూస్తుంటే మదిలో ఎన్నో భావాలు పలుకుతాయి. ఇలాంటి సుందరమైన దృశ్యం కోటిపల్లి వద్ద గోదావరిలో ఆదివారం కనువిందు చేసింది. సాయంత్రం ఆరేడు గంటల సమయంలో గోదావరి పంటుపై ప్రయాణిస్తున్న సమయంలో మొదట కాంతివంతమైన నారింజ రంగులో కనిపించిన ఆకాశం కొద్ది క్షణాల వ్యవధిలో నీలి రంగులో మారిన దృశ్యాలు కనువిందు చేశాయి. ఈ దృశ్యాలను 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కాయి.

- న్యూస్‌టుడే, ద్రాక్షారామ



కాపుల రిజర్వేషన్ల కోసం హోరెత్తిన నిరసనలు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: కాపులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ కాపు సంఘాల నాయకుల నిరసనలతో కిర్లంపూడి హోరెత్తింది. ఆదివారం వివిధ జిల్లాలతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కాపుసంఘాల నాయకులు, ప్రజలతో కిర్లంపూడి జనసంద్రంగా మారింది. ప్రత్తిపాడు, సామర్లకోట ర.భ.రోడ్డులో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. కిర్లంపూడికి రెండువైపుల నుంచి పాదయాత్రగా తరలిరావడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నర్సాపురం నియోజకవర్గం నుంచి కాపుసంఘాల నాయకులు 50 కార్లలో ర్యాలీగా ముద్రగడ నివాసానికి తరలివచ్చారు. అలాగే ప్రత్తిపాడు మండలం ధర్మవరం నుంచి కాపుసంఘం నాయకులు పాదయాత్రగా, సింహాద్రిపురం గ్రామస్థులు ఎడ్లబండ్లపై వచ్చారు. వాహనాలతోపాటు రాజుపాలెం నుంచి పాదయాత్రగా తరలివచ్చిన మహిళలు ర్యాలీ వెనుక మూడు కిలోమీటర్లమేర వాహనాలు నిలిచిపోయాయి. పలుచోట్ల ప్రధాన రహదారిపై ఆందోళనకారులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన కాపు సంఘం నాయకులు కిర్లంపూడిలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించారు. పిఠాపురం మండలం విరవ గ్రామానికి చెందిన కాపు సంఘం నాయకులు, యువకులు ముద్రగడ ఫొటోతో ఉన్న మాస్కులు ధరించి పాదయాత్రగా కిర్లంపూడి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో బొల్లి కొండబాబు, తలిశెట్టి వెంకటేశ్వరరావు, సిరిగిరెడ్డి సత్తిబాబు, చెక్కపల్లి సత్తిబాబు, రావి. శ్రీనివాస్, యెనుమల ఉమామహేశ్వరావు, కాకిలేటి జయబాబు, వివిధ గ్రామాల కాపుసంఘాల సభ్యులు పాల్గొన్నారు.



సింహాద్రిపురం గ్రామం నుంచి ఎడ్లబండ్లపై తరలివచ్చిన కాపుసంఘం నాయకులు



కిర్లంపూడిలో ర్యాలీగా తరలివస్తున్న నర్సాపురం కాపుసంఘం నాయకులు

'కాపులను బీసీల్లో కలపడం రాజ్యాంగ విరుద్ధం'

రమణయ్యపేట (సర్పవరంజంక్షన్), న్యూస్‌టుడే: కాపు, తెలగ, బలిజ, ఒంటరి వంటి అగ్రకులాలను బీసీల్లో కలపడం రాజ్యాంగ విరుద్ధమని, దీనివల్ల బీసీలు రాజ్యాంగ హక్కులను కోల్పోయి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందని రాష్ట్ర బీసీ ఉద్యమ నాయకుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. కాపులను బీసీల్లో చేర్చొద్దంటూ ఆదివారం కాకినాడ 1వ డివిజన్‌లోని గొల్లపేటలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, రామచంద్రపురం, మండపేట, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో ఓసీ వర్గాల వారే ఛైర్మన్‌లు, మేయర్‌గా ఉన్నారు. జడ్పీ, డీసీసీబీ, గ్రంథాలయ, గుడా ఛైర్మన్‌లు కూడా ఓసీలే ఉన్నారని, కనీసం కాకినాడ మేయర్ పదవి అయినా బీసీలకు ఇవ్వాలని కోరుతున్నాం. బీసీల్లో ఉప కులాలైన చేనేత, నాయిబ్రాహ్మణ, రజక, కొప్పవెలమ, శాలివాహన, స్వర్ణకార తదితర ఉపకులాలకు ఏపార్టీ కూడా ఈ ఎన్నికల్లో అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1వ డివిజన్‌లో బీసీలంతా స్వతంత్ర అభ్యర్థి కడలి శివన్నారాయణకు ఓటు వేసి గెలిపించాలనికోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు పప్పు దుర్గారమేష్, కుడిపూడి మహారాజు, కాకరపల్లి రవికాంత్, కలిదిండి చందు, టి.గోపీకృష్ణ, కడలి వెంకటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



గొల్లపేటలో ఖాళీ బిందెలతో బీసీల నిరసన

గ్రామీణ మాల్స్‌గా చౌక ధరల దుకాణాలు

పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

వేళంగి(కరప), న్యూస్‌టుడే: పేద ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పంపిణీ వ్యవస్థలోని చౌక ధరల దుకాణాలను గ్రామీణ మాల్స్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. కరప మండలం వేళంగిలోని పౌరసరఫరాల శాఖ గోదాములో ఆకస్మిక తనిఖీ చేశారు. గోదాములో ఉన్న బియ్యం, పంచదార, కందిపప్పుల రికార్డులను, సరకుల నాణ్యత, నిల్వలను పరిశీలించారు. అనంతరం మంత్రి స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి కడుపునిండా అన్నం పెట్టడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి, అన్న అమృత హస్తం పథకానికి ఇక నుంచి సోనామసూరి రకం బియ్యాన్ని సరఫరా చేసేలా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని, తాము యాక్షన్ ప్లాన్ తయారు చేస్తున్నామన్నారు. ఇటీవల గుంటూరులో చౌక దుకాణాల్లో సరఫరా చేస్తున్న సరకుల్లో నాణ్యత లేనట్లు వస్తున్న ఆరోపణలతో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి ప్రజలకు నాణ్యతతో కూడిన సరకులు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. మార్కెట్‌లో నిత్యావసరాల ధరల అదుపునకు నాణ్యమైన సరకులను చౌక ధరల దుకాణాల ద్వారా ప్రజలకు విక్రయించడానికి గ్రామీణ మాల్స్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు నిర్ణయించాం. ఇందులో భాగంగా డీలర్ల వ్యవస్థను బలోపేతం చేసేవిధంగా అలాగే రాష్ట్రంలో ఉన్న 29వేల మంది డీలర్లకు ఆదాయం పెంచేలా చేయడంతో పాటు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు బహిరంగ మార్కెట్ కంటే 20శాతం తక్కువ ధరకు నిత్యావసర సరకులను విక్రయించేలా మా శాఖ ప్రణాళిక రూపొందించిందన్నారు. నాణ్యత లేకపోయినా, తక్కువ తూకం వచ్చినా గోదాం నుంచి సరకులు తీసుకోవద్దని, రేషన్ దుకాణాల్లో ప్రజలకు తూకాల్లో తేడా వస్తే డీలర్లదే బాధ్యత అని మంత్రి అన్నారు. రేషన్ దుకాణాల వద్ద నగదు రహిత లావాదేవీలు తప్పనిసరి కాదని, వినియోగదారుల ఇష్టం మేరకు సరకులను కొనుగోలు చేసుకోవచ్చని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో వి.రవికిరణ్, డివిజనల్ అధికారి ఏ.దృష్టారావు, ఏఎస్‌వో పీతల సురేష్, కరప, తాళ్లరేవు మండలాల అధికారులు పాల్గొన్నారు.



గోదాములో చక్కెర పరిశీలిస్తున్న మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

జీజీహెచ్‌లో నేటి ఓపీ సేవలు

బాలాజీ చెరువు సెంటర్(కాకినాడ): కాకినాడ ప్రభుత్వ సామాన్యాసుపత్రి(జీజీహెచ్)లో శనివారం అందుబాటులో ఉండనున్న ఓపీ సేవల వివరాలివి...

ఓపీ విభాగం	సేవలందించే రూం.నెం	ఓపీ విభాగం	సేవలందించే రూం.నెం
గుండె వ్యాధులు	3	చర్మ, సుఖ వ్యాధులు	14
మెడికల్	4	చిన్నపిల్లలు	15
న్యూరోసర్జరీ	5	చెవి, ముక్కు, గొంతు	16
ప్లాస్టిక్ సర్జరీ	5	దంత సంబంధ సమస్యలు	17
ఛాతి, టీబీ	5ఎ	నేత్ర సంబంధ సమస్యలు	18
ఎముకలు	9	కేన్సర్	64
జనరల్ సర్జరీ	10	ఫిజియోథెరపి	65
సైకియాట్రి	10ఎ	నొప్పి నివారణ చికిత్స	66
గర్భిణులు	11ఎ	ఏఆర్‌టీ ప్రసూతి	67
స్త్రీ వ్యాధులు	11బి		

జీజీహెచ్‌లో వివిధ వైద్య సేవల మార్గ నిర్దేశానికి పర్యవేక్షణాధికారి భవంతి కింది అంతస్తులో సహాయ విభాగం ఉంది. రోగుల సహాయకులకు నామమాత్రపు ధరతో మధ్యాహ్న భోజన వసతి సుభోజనం పేరిట సర్జికల్ విభాగం వద్ద అందుబాటులో ఉంది. వార్డులు, ఇతర వైద్య సేవలందించే ప్రదేశాలలో అక్కడి సిబ్బంది లంచం కోరడం, ఇతర సమస్యలను నేరుగా అధికారులకు ఫిర్యాదు చేసేందుకు 98499 03871, 0884-2302003, 0884-2302158, 0884-2302002 నెంబర్లలో సంప్రదించవచ్చు. అమర్‌నాథ్ యాత్రికుల కోసం ఇచ్చే వైద్య ధ్రువీకరణ పత్రాలను సోమవారం నుంచి శనివారం మధ్య కార్యాలయ పనివేళల్లో మంజూరు చేస్తారు.

ప్రతిభ

TENTH English

PREPOSITIONS

A Preposition is a word such as in, on, at or beside that is used before a noun or a noun phrase or a pronoun to show a link with another word or phrase.

It goes without saying that language is the dress of thought. As such, we express our feelings and thoughts through words. The words we use in a sentence need to be precise, accurate and forceful. So to say, prepositions are such forceful, nay powerful words which govern the entire sentence. Therefore, a thorough practice of using correct prepositions is needed for the learner.

Nithin is fond *of* eating..

★ Study the prepositions under lined in the following sentences:

1. Vaccination protects us from many diseases.
2. A man is known by the company the keeps.
3. Foundation of a house lies below the ground level.
4. Srinidhi has no appetite for sweets.

The words from, by, below and for are prepositions.

Kinds Of Prepositions

Prepositions have different functions: to indicate time, place, movement, direction, means, manner, purpose, source, concession, etc.

Examples: 1. The train arrived on time. (Time)
2. I met Sahithi at the theatre. (Place)
3. Shirisha went to the market for fruits. (Purpose)
4. Rishita drove along the main road in a hurry. (Direction)

A. Simple Prepositions: in ★ on ★ at ★ to ★ for ★ from ★ of ★ off out ★ by ★ till ★ with ★ through, etc.

Study the following sentences and observe the prepositions used in each sentence and note the function of the prepositions given in the brackets.

1. Vaishnavi waited for the doctor till he returned. (Time)
2. Naveen left Boath for Dubai. (Place)
3. Inspite of the hurdles, Kavya succeeded in her efforts. (Concession)

B. Compound Prepositions

about ★ above ★ across ★ along ★ amidst ★ among ★ around ★ before ★ behind ★ below ★ beneath ★ beside ★ between ★ beyond ★ inside ★ out side ★ within ★ with out

Examples: 1. A narrow path ran in between the two houses.
2. The moon moves around the Earth.
3. Inside the box was a diamond studded watch.
4. I cannot allow the work to continue beyond the end of December.

Exercise - 1

Fill in the blanks with suitable Simple Prepositions.

1. Nithin is fond .... eating sweets.
2. English is quite different .... Telugu.
3. Malavika fell ... her bicycle and broke her leg.
4. Ashwini drove her car .... the side gate.
5. I'll return your book .... a week.

Exercise - 2

Fill in the blanks with suitable Compound prepositions.

1. Apple and banana are .... the most popular fruits.
2. Moiz usually sits .... Saikumar in the class.
3. There is something special .... our Headmaster.
4. A new bridge is being built .... the river.
5. She looks nice .... make-up.

C. Compound Prepositional Phrases

Compound Prepositional Phrases consist of two or more words, such as due to, because of, together with, etc.

Examples:

1. The rowdy was arrested according to IPC 420.
2. I cannot see the film because a tall man is sitting infront of me.
3. Vijayendra Prasad goes to school along with Vamsi Krishna daily.
4. Ring the alarm bell in case of emergency.

Study the following compound Prepositional Phrases and note the meanings given to each of them

Comp.Prep.Phrases	Meanings
along with	together with
on account of	because of
by means of	through the agency of
apart from	separate from
ahead of	earlier than something/ somebody
in front of	located before
in place of	as a substitute for
inspite of	disregarding the difficulty
in case of	in the event of
by way of	via
due to	on account of
for the sake of	for the good of
in addition to	added to
in accordance with	in agreement with

Examples: The thief entered the house by means of a broken window.
2. Shruthi attends special classes on Sundays in addition to regular practice.
3. We postponed our trip to Ramoji Film City due to bad weather.
4. Inspite of being rich, my neighbour is not happy.

Exercise - 3

Fill in each blank with the correct Compound Prepositional Phrases from those given under each sentence.

1. .... his injury, Umesh will play in Sunday's match.
a) Due to b) For the sake of c) In spite of
2. He sent me some flowers .... an apology.
a) by way of b) in case of c) apart from
3. Is there parking space .... the hotel?
a) ahead of b) in front of c) along with
4. She lost her way when she went into the jungle .... firewood.
a) for the sake of b) in addition to
c) in search of

Answers

Ex-1: 1) of 2) from 3) off 4) through 5) in
Ex-2: 1) among 2) beside 3) about 4) across 5) without
Ex-3: 1-c 2-a 3-b 4-c.



రచయిత
డి.నారాయణ,
విషయ నిపుణులు

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?

1. ఒక వాహనం తన ప్రయాణ దూరంలోని మూడు సమ దూరాలను వరుసగా 80, 60, 30 కి.మీ. / గంట వేగంతో ప్రయాణిస్తే దాని సగటు వేగం ఎంత? (కి.మీ./గంటల్లో)
1) 60 2) 50 3) 48 4) 24
2. ఖగోళశాస్త్రంలో 'పార్‌సెక్' దేనికి ప్రమాణం?
1) దూరం 2) కాలం 3) వేగం 4) పౌనఃపున్యం
3. ట్రాన్స్‌ఫార్మర్ మార్చలేని AC విద్యుత్‌కి సంబంధించిన అంశం?
1) వోల్టేజీ 2) కరెంట్ 3) పౌనఃపున్యం 4) పైవన్నీ
4. భూస్థావర (జియోస్టేషనరీ) ఉపగ్రహం భూమి కేంద్రం నుంచి సుమారు ఎంత ఎత్తులో ఉంటుంది?
1) 36000 కి.మీ. 2) 6,400 కి.మీ.
3) 21,000 కి.మీ. 4) 42,400 కి.మీ.
5. రేడియో రిసీవర్లలో ఉపయోగించే వలయం ఏది?
1) శుద్ధ నిరోధ వలయం 2) LC - ట్యాంక్ వలయం
3) శుద్ధ ప్రేరక వలయం
4) శుద్ధ కెపాసిటర్ వలయం
6. టెఫ్లాన్ పూత పూసిన లోహ పరికరాలను ఉపయోగించి అధిక వోల్టేజీ విద్యుత్ ప్రసారాలను నిలిపివేయకుండానే వాటిని తీసుకుని వెళ్లే తీగలను ముట్టుకుంటారు. ఎందు కంటే టెఫ్లాన్ ఒక...
1) విద్యుత్ బంధకం 2) అర్ధ వాహకం
3) విద్యుత్ వాహకం 4) అతివాహకం
7. గాలిలో ధ్వని వేగం దేనిపై ఆధారపడదు?
1) పీడనం 2) ఆర్ద్రత
3) గాలి (పవన) వేగం 4) ఉష్ణోగ్రత
8. ప్రతిపాదన **(A):** పాలీవినైల్ క్లోరైడ్‌తో తయారైన రెయిన్ కోట్లను వర్షం నీరు తడపదు.
కారణం (R): పాలీవినైల్ క్లోరైడ్, నీటి మధ్య స్పర్శ కోణం 90° కంటే ఎక్కువ.
1) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ.
2) A, R రెండూ సరైనవి. A కి R సరైన వివరణ కాదు.
3) A, R రెండూ సరైనవి కావు.
4) A సరైంది. కానీ, R సరైంది కాదు.
9. శక్తి నిత్యత్వ నియమానికి ప్రతిరూపం -
1) లెంజ్ నియమం
2) ఉష్ణగతిక శాస్త్ర మొదటి నియమం
3) కిర్కాఫ్ రెండో నియమం 4) పైవన్నీ
10. శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
1) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు ఘన పరిమాణం శూన్యం అవుతుంది.
2) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను చేరిన వాయువు పీడనం శూన్యం అవుతుంది.
3) శూన్య కెల్విన్ ఉష్ణోగ్రతను పొందడం అసాధ్యం.
4) పైవన్నీ సరైనవే
11. కేంద్రక బలాలు....
1) ఆకర్షణ బలాలు 2) స్వల్ప అవధి బలాలు
3) అత్యంత బలమైన బలాలు 4) పైవన్నీ
12. రాకెట్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
1) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
2) శక్తి నిత్యత్వ నియమం
3) ద్రవ్యవేగ నిత్యత్వ నియమం 4) పైవన్నీ
13. ఉష్ణశక్తిని విద్యుత్‌శక్తిగా మార్చేది ఏది?
1) థర్మోకపుల్ 2) ఎలక్ట్రిక్ హీటర్
3) ఎలక్ట్రిక్ బల్బు 4) ఫొటో సెల్
14. స్వేచ్ఛగా కిందపడే వస్తువు...
1) మొత్తం యాంత్రిక శక్తి స్థిరం
2) స్థితిజ శక్తి క్రమంగా పెరుగుతుంది



రచయిత
డి. అనంత రామకృష్ణ
విషయ నిపుణులు

3) గతిజ శక్తి క్రమంగా పెరుగుతుంది
4) 1, 3
15. ఎత్తయిన ప్రదేశం (విమానం) నుంచి చూస్తే ఇంద్రధనస్సు ఏ ఆకారంలో కనిపిస్తుంది?
1) అర్ధ వృత్తం 2) వృత్తం
3) పరావలయం 4) ఏదీకాదు
16. 40°C వద్ద ఉన్న 500 మి.లీ. నీటిని అంతే పరిమాణంలో, 70°C వద్ద ఉన్న నీటికి కలిపితే ఫలిత ఉష్ణోగ్రత విలువ ఎంత?
1) 110° C 2) 55°C 3) 40°C 4) 65°C
17. ఒక వ్యక్తికి సరైన దృష్టి కోసం డాక్టర్ +2D కటకం వాడమని సలహా ఇచ్చారు. అది ఏ రకమైన కటకం? దాని నాభ్యాంతరం ఎంత?
1) కుంభాకార, 100 సెం.మీ.
2) పుటాకార, 10 సెం.మీ.
3) కుంభాకార, 50 సెం.మీ.
4) పుటాకార, 50 సెం.మీ.
18. కాంతి విరళ యానకం నుంచి సాంద్రతర యానకంలోకి ప్రసరిస్తే, దాని తరంగదైర్ఘ్యం (λ), పౌనఃపున్యం (υ) విలువలు ఏ విధంగా ఉంటాయి?
1) λ, υ రెండూ పెరుగుతాయి
2) λ పెరుగుతుంది, υ స్థిరం
3) λ తగ్గుతుంది, υ స్థిరం
4) λ, υ రెండూ తగ్గుతాయి
19. వస్తువు గతిజ శక్తి వేటిపై ఆధారపడుతుంది?
1) ద్రవ్యరాశి, ఎత్తు 2) వేగం, కాలం
3) ఎత్తు, త్వరణం 4) ద్రవ్యరాశి, వేగం
20. సమ వేగంతో వెళ్లే వస్తువు ....
1) చలన దిశ స్థిరం, వడి అస్థిరం
2) వడి స్థిరం, చలన దిశ అస్థిరం
3) వడి, చలన దిశ రెండూ అస్థిరం
4) వడి, చలన దిశ రెండూ స్థిరం
21. మానవుడి గుండె సగటున నిమిషానికి 75 సార్లు కొట్టుకుంటుంది. అయితే దాని స్పందన పౌనఃపున్యం ఎంత? (హెర్ట్జ్‌లలో)
1) 1.25 2) 3.25 3) 4.25 4) 2.25
22. R నిరోధం ఉన్న n నిరోధాలను సమాంతరంగా కలిపితే, ఫలిత నిరోధం...
1) nR 2) n^2 R 3) $\frac{R}{n^2}$ 4) $\frac{R}{n}$
23. వర్షాకాలంలో రోడ్లపై నూనె పొరలు రంగుల్లో కనిపించడానికి కారణం?
1) ధ్రువణం 2) వ్యతికరణం
3) పరిక్షేపణం 4) విక్షేపణం
24. పౌనఃపున్య మాడ్యులేషన్‌లో (FM) వాహక తరంగం పౌనఃపున్యం దేనికి అనుగుణంగా మారుతుంది?
1) సంకేత తరంగ తక్షణ పౌనఃపున్యం
2) సంకేత తరంగ తక్షణ దశ
3) సంకేత తరంగ తక్షణ కంపన పరిమితి
4) సంకేత తరంగ తక్షణ వేగం
25. నక్షత్రం నుంచి వెలువడే కాంతి క్రమంగా ఎరుపు రంగుకి మారితే, అది దేన్ని సూచిస్తుంది?
1) నక్షత్రం భూమి వైపు రావడాన్ని
2) నక్షత్రం విరామ స్థితిలో ఉండటాన్ని
3) నక్షత్రం భూమికి దూరంగా వెళ్లడాన్ని
4) నక్షత్రం ఉష్ణోగ్రత క్రమంగా తగ్గడాన్ని

జవాబులు

1-3	5-2	9-4	13-1	17-3	21-1	25-3
2-1	6-1	10-4	14-4	18-3	22-4	
3-3	7-1	11-4	15-2	19-4	23-2	
4-4	8-1	12-3	16-2	20-4	24-1	

కరెంట్ అఫైర్స్

ప్రతిభ



క్రీడలు — టెస్ట్ సిరీస్ నెగ్గిన భారత్ — ఆగస్టు 14

శ్రీలంకలో శ్రీలంకతో జరిగిన మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-0 తో క్లీన్‌స్వీప్ చేసింది. విదేశీ గడ్డపై మూడు టెస్టుల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన తొలి భారత జట్టుగా కోహ్లీ సేన ఘనత సాధించింది. మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌గా శిఖర్ ధావన్ నిలిచాడు.

జీవించదగిన అత్యుత్తమ నగరం ఏది..?

జాతీయం

ఆగస్టు 13: కీలక బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ బాధ్యతలు చేపట్టిన మూడు వారాల్లో ఆరు కీలక బిల్లులపై సంతకాలు చేశారు. ఆయన ఆమోదం లభించడంతో ఇకపై అవి చట్టాలుగా రూపుదాల్చనున్నాయి.

★ బ్రిటిష్ కాలంనాటి రెండు చట్టాల స్థానంలో రూపొందించిన ది అడ్మిరాలిటీ (పరిధి, మారిటైమ్ క్లెయిమ్‌ల చెల్లింపు) బిల్లు; బాలల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు (సవరణ) బిల్లు; జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే గణాంకాల సేకరణ (సవరణ) బిల్లు; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) బిల్లు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (సవరణ) బిల్లు; ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ బిల్లులపై రామ్‌నాథ్ సంతకాలు చేశారు.

ఆగస్టు 14: భారతీయ భాషల్లో గూగుల్ వాయిస్ సెర్చ్

టెక్నాలజీ దిగ్గజ సంస్థ గూగుల్ తన వాయిస్ సెర్చ్ ఫీచర్‌కు కొత్తగా 8 భారతీయ భాషలను జోడించింది. ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లిష్ భాషల్లోనే గూగుల్ వాయిస్ సెర్చ్ సౌలభ్యం అందుబాటులో ఉంది. ఇప్పుడు తెలుగు, బెంగాలీ, మలయాళం, తమిళం, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ భాషల్లోనూ దీన్ని అందించనున్నామని సంస్థ తెలిపింది.

★ గూగుల్ యాప్‌లో వాయిస్ సెట్టింగ్స్‌లో కావాల్సిన భాషను ఎంచుకోవాలని సూచించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 149 భాషలకు ఈ వెసులుబాటు ఉంది.

ఆగస్టు 15: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

దేశవ్యాప్తంగా 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ఆధార్ నుంచి అంతరిక్షం దాకా అన్ని అంశాలను స్పృశించారు.

★ 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే 2022 నాటికి ప్రతి పేద వ్యక్తికి పక్కా ఇల్లు నిర్మించేలా పని చేయాలని పిలుపునిచ్చారు. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు, నల్లధనంపై కొరడా సహా తన ప్రభుత్వం చేపట్టిన అనేక సంస్కరణలు, పథకాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్య సాధన కోసం 'భారత్ చోడో' అని నినదించినట్లు ఇప్పుడు 'భారత్ జోడో' నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

★ సమష్టి సంకల్ప శక్తి ద్వారా 2022 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేసే దిశగా నవభారతాన్ని ఆవిష్కరించాలని మోదీ పేర్కొన్నారు.

★ ప్రధాని హోదాలో మోదీ చేసిన నాలుగు స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ఇదే అత్యంత చిన్న ప్రసంగం (సుమారు 56 నిమిషాలు) కావడం విశేషం.

ఆగస్టు 16: రికార్డు స్థాయిలో ఆహారధాన్యాల ఉత్పత్తి

గత జూన్‌తో ముగిసిన 2016-17 పంట సంవత్సరంలో దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 27.56 కోట్ల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి జరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంచనా వేసిన దానికంటే 20.30 లక్షల టన్నులు అధిక దిగుబడి వచ్చినట్లు పేర్కొంది.

★ 2015-16 (జులై - జూన్)లో 25.17 కోట్ల టన్నుల దిగుబడి వచ్చింది. 2013-14 లో వచ్చిన 26.50 కోట్ల టన్నుల దిగుబడే ఇంతవరకు రికార్డు.

★ వరి దిగుబడులు 10.41 కోట్ల టన్నుల నుంచి 11.01 కోట్ల టన్నులకు, గోధుమలు 9.29 కోట్ల టన్నుల నుంచి 9.83 కోట్ల టన్నులకు, తృణధాన్యాలు 3.85 కోట్ల టన్నుల నుంచి 4.41 కోట్ల టన్నులకు, పప్పుధాన్యాలు 1.63 కోట్ల టన్నుల నుంచి 2.29 కోట్ల టన్నులకు పెరిగాయి.

★ కంది, మినపప్పుల దిగుబడులు చాలా బాగుండటం గమనార్హం. పత్తి ఉత్పత్తి 3.01 కోట్ల బేళ్ల నుంచి 3.30 కోట్ల బేళ్లకు పెరిగింది. చెరకు ఉత్పత్తి 11.98 శాతం మేర పడిపోయింది.



ఆగస్టు 17: అమెరికా నుంచి అపాచీ హెలికాప్టర్లు

సైన్యం కోసం అమెరికా నుంచి ఆరు అధునాతన అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ అధ్యక్షతన దిల్లీలో సమావేశమైన రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ) ఆమోదం తెలిపింది. రూ. 4,168 కోట్ల విలువైన ఈ ప్రతిపాదన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉంది. దీనికి తోడు అధునాతన గ్రిగోరివిచ్ శ్రేణి స్టెల్త్ యుద్ధనౌకలకు రూ. 490 కోట్లతో రెండు జోర్యా గ్యాస్ టర్బైన్ ఇంజిన్లు కొనుగోలు చేయడానికి కూడా డీఏసీ ఆమోదం తెలిపింది

అంతర్జాతీయం

ఆగస్టు 12: కెన్యా అధ్యక్షుడిగా మళ్లీ ఉహురు కెన్యట్టా



ఆఫ్రికా దేశమైన కెన్యా అధ్యక్షుడిగా ఉహురు కెన్యట్టా రెండోసారి ఎన్నికయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో 54.27 శాతం ఓట్లు దక్కించుకున్న కెన్యట్టా విజయం సాధించినట్లు కెన్యా ఎన్నికల సంఘం ప్రకటించింది.

★ ప్రతిపక్ష నేత రైలా ఓడింగా 44.74 శాతం ఓట్లు పొందారు. అయితే ఎన్నికలు సక్రమంగా జరగలేదని, రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందని ఓడింగా ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ మద్దతుదారులు నిర్వహించిన ఆందోళనలు హింసాత్మకంగా మారి, 11 మంది మరణించారు.

ఆగస్టు 14: కలరా బారిన యెమన్

యెమన్‌లో కలరా విజృంభిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. 2017 ఏప్రిల్ నుంచి 5 లక్షలకుపైగా ప్రజలు దీని బారినపడగా 1975 మంది మృతి చెందినట్లు పేర్కొంది.

వార్తల్లో ప్రదేశాలు

ఆగస్టు 14:

హైదరాబాద్‌లో ప్రపంచ పారిశ్రామికవేత్తల సదస్సు

ప్రపంచ పారిశ్రామికవేత్తల (వ్యవస్థాపకుల) వార్షిక శిఖరాగ్ర సదస్సును 2017 నవంబరు 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరుకానున్నారు. అగ్ర రాజ్యమైన అమెరికా ఈ సదస్సును నిర్వహిస్తుండటం విశేషం.


ఆగస్టు 16: అత్యుత్తమ నగరంగా మెల్‌బోర్న్

ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ రూపొందించిన గ్లోబల్ లివబిలిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో జీవించదగిన అత్యుత్తమ నగరంగా ఆస్ట్రేలియా రాజధాని మెల్‌బోర్న్ ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో వియన్నా (ఆస్ట్రియా), వాంకోవర్ (కెనడా) ఉన్నాయి.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

ఆగస్టు 17:

స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు



తెలుగు రాష్ట్రాల్లోని 35 ప్రభుత్వ పాఠశాలలు జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు ఎంపికయ్యాయి. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల నుంచి 172 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికకగా వీటిలో 35 పాఠశాలలు తెలుగు రాష్ట్రాలకు చెందినవి కావడం విశేషం (ఏపీ నుంచి 21, తెలంగాణ నుంచి 14 ప్రభుత్వ పాఠశాలలు).

★ స్వచ్ఛ భారత్‌లో భాగంగా కేంద్రం ఈ పురస్కారాలను అందిస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేందుకు ఉన్న సౌకర్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం వీటిని ప్రకటించింది.

★ తమిళనాడు నుంచి అత్యధికంగా 25 పాఠశాలలు ఈ పురస్కారాలకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఆరోగ్య-పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్న ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నగదు బహుమతి అందిస్తారు.

రాష్ట్రీయం - తెలంగాణ

ఆగస్టు 15: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

తెలంగాణ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఏడాది కొత్తగా 84,876 ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు కేసీఆర్ చెప్పారు.

★ 1936 లో నిజాం కాలంలో భూసర్వే జరిగిందని, ఆ తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే సమగ్ర భూ సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బడ్జెట్‌లో సింహభాగాన్ని సంక్షేమానికే వెచ్చిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను పరిపూర్ణం చేసేందుకు నడుం బిగించినట్లు చెప్పారు.

★ 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధి రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని పేర్కొన్నారు.

రాష్ట్రీయం - ఆంధ్రప్రదేశ్

ఆగస్టు 15: తిరుపతిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 71 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిరుపతిలోని తారకరామ మైదానంలో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్రంలోని నీటి ప్రాజెక్టుల కోసం రూ. 43 వేల కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర యోధుల పింఛనును రూ. 7 వేల నుంచి రూ. 15 వేలకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2019 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని భావిస్తున్నట్లు ప్రకటించారు.

పురుషోత్త పట్నం ఎత్తిపోతల ప్రారంభం

✪ గోదావరి నదిని ఏలేరుతో అనుసంధానించే పురుషోత్త పట్నం ఎత్తిపోతల పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

ఆగస్టు 16: ఐయూఐహెచ్ శంకుస్థాపన

రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక ఇండో-యూకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ (ఐయూఐహెచ్), అమరావతి మెడిసిటీ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుపై ఐయూఐహెచ్ రూ. 1600 కోట్లు వెచ్చించనుంది.

సిద్దిపేటకు ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రం

✪ అభివృద్ధి, సంస్కరణలతో దూసుకెళ్తున్న సిద్దిపేట పురపాలిక మరో ఘనత సాధించింది. ఐఎస్ఓ 9001-2015 ధ్రువపత్రానికి ఎంపికై, రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి పురపాలికగా నిలిచింది.

ఆగస్టు 16: తెలంగాణ పదాలతో నిఘంటువు

పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ ప్రజల భాష, యాస చిరకాలం ఉండేలా లక్ష పదాలతో నిఘంటువు తయారీకి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అరుదైన పదాలన్నింటినీ సేకరించి అక్షరబద్ధం చేయాలనేది ప్రణాళిక. పదాల అన్వేషణకు అమరేశం రాజేశ్వర్ శర్మ, కట్టా శేఖర్ రెడ్డి, రవ్వా శ్రీహరి, ఘంటా చక్రపాణి, డాక్టర్ నలిమెల భాస్కర్‌లతో కమిటీ ఏర్పాటు చేశారు.

'ఓడీఎఫ్'గా హైదరాబాద్

✪ హైదరాబాద్ మహా నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జన రహితంగా (ఓడీఎఫ్) ప్రకటిస్తూ జీహెచ్‌ఎంసీ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది.

వార్తల్లో వ్యక్తులు

ఆగస్టు 11:

సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్ ప్రసూన్ జోషి



సెన్సార్ బోర్డు నూతన ఛైర్మన్‌గా కవి, పద్మశ్రీ ప్రసూన్ జోషి నియమితులయ్యారు. వచ్చే మూడేళ్ల కాలానికి ప్రసూన్ ఈ పదవిలో కొనసాగుతారు. పహ్లాజ్ నిహ్లాని స్థానంలో ప్రసూన్ నియమితులయ్యారు. సెన్సార్ బోర్డు సభ్యులుగా విద్యాబాలన్, గౌతమి, జీవిత తదితరులు నియమితులయ్యారు.

✪ నాటి తరం పరుగుల వీరుడు మిల్కాసింగ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సౌహార్ద్ర రాయబారిగా నియమితులయ్యారు. దక్షిణాసియా ప్రాంతంలో శారీరక శ్రమ పెంపుదల ఆవశ్యకతపై ప్రచారం చేయడానికి డబ్ల్యూహెచ్ఓ ఆయన్ను ఎంపిక చేసింది.

ఆగస్టు 14:

ఎంతోమంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించి, డాక్టర్ 'దీదీ'గా ప్రఖ్యాతిగాంచిన భక్తియాదవ్ (91) ఇండోర్‌లో మరణించారు. మధ్యప్రదేశ్ తొలి మహిళా వైద్యురాలిగా గుర్తింపు పొందిన భక్తియాదవ్ గైనకాలజిస్టుగా అందించిన సేవలకు కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది.

అవార్డులు

ఆగస్టు 14:

శంకర్‌రావుకు రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం

కేంద్ర ప్రభుత్వం 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల్లో ప్రతిభావంతమైన సేవలు అందించిన 990 మందికి అత్యున్నత పోలీసు పతకాలు ప్రకటించింది. వామపక్ష తీవ్రవాదులతో జరిగిన పోరులో ప్రాణాలర్పించిన చత్తీస్‌గఢ్ పోలీసు జవాను కమాండర్ శంకర్‌రావుకు మరణానంతరం రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకాన్ని ప్రకటించారు. కీర్తిచక్ర పురస్కారాన్ని అయిదుగురికి ప్రకటించారు. హవల్దార్ గిరిస్ గురుంగ్, మేజర్ డేవిడ్ మన్లుం, కమాండెంట్ ప్రమోద్ కుమార్ మరణానంతరం కీర్తిచక్రకు ఎంపికయ్యారు. మిగిలిన ఇద్దరిలో మేజర్ ప్రీతం సింగ్ కున్వార్, చేతన్ కుమార్ చీతా ఉన్నారు.



రచయిత
- సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

వీరేశ్వరునికి లక్ష రుద్రాక్ష మహోత్సవం

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మురమళ్లలోని భద్ర కాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్ష మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి తరువాత అంతటి పర్వదినమైన శ్రావణ మాసశివ రాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కాశీ నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలను భారీ ఊరే గింపు నడుమ పవిత్ర వృద్ధ గౌతమి నదికి తొడ్కొనివెళ్లి సంప్రోక్షణ చేశారు. విఘ్నే శ్వరపూజ, పుణ్యాహవచనం, దీక్షధారణ, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం, లక్ష రుద్రాక్షలతో రుద్రార్చన, లక్ష బిల్వార్చన తదితర పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వ ర్యంలో ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బయ్య, పేటేటి శ్యామలకుమార్, ఆలయ పురోహితులు పూజలు జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు రుద్రాక్ష మహోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఛైర్మన్ జంపన బాబు, ఈవో సత్యనారాయణలు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.



లక్ష రుద్రాక్షల నడుమ భద్రకాళీ సమేత వీరేశ్వరుడు



స్వామి వారికి బిల్వార్చన

దృష్టిసారిస్తే..ఉండదు చింత



జాతీయరహదారిపై ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ వద్ద తారుఊడిపోయిన చిత్రం

రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వెళ్లే జాతీయ రహదారిలో ప్రతి కిలోమీటర్‌కు ప్రమాదం జరిగే ప్రదేశం బ్లాక్‌జోన్ అంటూ బోర్డులు పెట్టారు. అయితే ఆ ప్రమాదాలకు కారణమవుతున్న చిన్నచిన్న అవాంతరాలను మాత్రం తొలగించడం లేదు. కొన్నిచోట్ల తారులేచిపోయి గతుకులమయమైంది. పక్కనున్న చెట్లు రోడ్డుపైకి వ్యాపిస్తున్నాయి. రక్షణగా ఉన్న ఇనుప గడ్డర్లు విరిగి ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు వీటిపై దృష్టిసారించాలని పలువురు ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

-ఈనాడు, రాజమహేంద్రవరం



జొన్నాడ వంతెన ఇసుక ర్యాంప్ వద్ద రక్షణగా ఉన్న ఇనుప రైలింగ్ విరిగి ప్రమాదకరంగా..



రండీ.. లఘు చిత్రం తీద్దాం

■ దివ్యాంగుల స్వావలంబనపై పోటీలకు ఆహ్వానం

■ ఆరు విభాగాల్లో రూ.నాలుగు లక్షలు గెలుచుకునే అవకాశం

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: యువతలో దాగున్న కళలను వెలికితీయడంతో పాటు వారి నైపుణ్యాలకు పదునుపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. గతంలో స్వచ్ఛ భారత్ లఘు చిత్ర పోటీలను నిర్వహిస్తే.. ఈసారి మైగవ్ వేదికపై పోటీలను నిర్వహించి బహుమతులు అందించనున్నారు. ప్రధాని నరేంద్రమోదీతో పాటు సంబంధిత మంత్రిత్వ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులను కలిసే అవకాశాన్నీ కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని దివ్యాంగజన సాధికార విభాగం 'దివ్యాంగ జనుల సాధికారత' అంశంపై లఘుచిత్ర పోటీలకు ఆహ్వానం పలుకుతోంది. ఆరు విభాగాల్లో నిర్వహించే ఈ పోటీల్లో తుది విజేతలకు రూ. నాలుగు లక్షలు బహుమానంగా అందిస్తారు. జిల్లాలో లఘు చిత్రాలను చిత్రీకరించడంలో ఎంతో మంది యువత తమ నైపుణ్యాన్ని ఇప్పటికే ప్రదర్శిస్తున్నారు. చరవాణి మొదలుకుని కెమెరాలతో సైతం లఘు చిత్రాలను చిత్రీకరించి అంతర్జాలంలోని సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారు. కొందరు అవార్డులను సైతం సొంతం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కల్పిస్తున్న ప్రస్తుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే.. పేరుప్రఖ్యాతులతో పాటు నగదు పురస్కారాన్నీ అందుకునే అవకాశం ఉంటుంది. అలాగే జిల్లాలో పదిరకాల వైకల్యాలతో బాధపడే దివ్యాంగులు సుమారుగా 68 వేలు వరకు ఉంటారు. వీరికి మేలు కలిగేలా, వారిలో స్ఫూర్తి నింపేలా లఘు చిత్రాలను రూపొందించాల్సి ఉంది.

ఒక్కో నేపథ్యంలో...

దివ్యాంగజనుల సాధికారతపై నిర్మించే లఘుచిత్రా



లకు సంబంధించి మంత్రిత్వశాఖ నిర్దేశించిన ఆరు విభాగాల్లో ఏదైనా ఒక విభాగాన్ని నేపథ్యంగా ఎంచుకోవాలి. ప్రతి విభాగంలో విజేతలైన ఒక్కరికి మాత్రమే రూ. నాలుగు లక్షలు బహుమానంగా అందజేస్తారు. ● దివ్యాంగజనులకు అందజేస్తున్న ఉపకార వేతనాలు, వారికి ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలతో లాభాలు, వారి అభివృద్ధికి ప్రభుత్వం జాతీయ వికలాంగుల అభివృద్ధి, ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న రుణాలతో లబ్ధి, వారికి అనుకూలమైన భవనాల నిర్మాణాలతో ఒనగూరే సౌకర్యాలు, దివ్యాంగజనులకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ అందించడం వలన కలిగే ప్రయోజనాలతో పాటు వారి సేవలో పనిచేస్తున్న ఎన్జీవో సంస్థల వల్ల కలిగే మేలు తదితర అంశాలపై లఘుచిత్రాలను రూపొందించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు మైగవ్ వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

సామాన్య ప్రజానీకానికి..

ప్రభుత్వం నిర్వహిస్తున్న యాక్సెస్‌బుల్ ఇండియా క్యాంపెన్‌పై అవగాహన కల్పించడంతో పాటు దివ్యాంగజనుల సాధికార సంస్థ ద్వారా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల సమాచారం. సామాన్య ప్రజానీకానికి చేరువయ్యేలా.. ప్రకటనల ద్వారా రూపొందించడం ఈ పోటీ ముఖ్య ఉద్దేశం. ఈ పోటీకి సంబంధించి దేశంలోని సామాన్య ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎలక్ట్రానిక్ ఉపకరణం సాయంతో రూపొందించిన హెచ్‌డీ ఫార్మెట్‌లోని లఘు చిత్రాలను అనుమతించనున్నారు. ఇక ఆయా అంశాలను కేంద్ర సమాచార, ప్రచార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని డైరెక్టర్ ఆఫ్ ఫిల్మ్ ఫెస్టివల్ పర్యవేక్షించనున్నారు.

ఇవీ.. నిబంధనలు

● ఈ పోటీల్లో ఎవరైనా ఔత్సాహికులు పాల్గొనవచ్చు. * లఘుచిత్రాన్ని భారతీయ అధికార భాషల్లో ఏ భాషలోనైనా రూపొందించవచ్చు. ఆంగ్లంలో సబ్ టైటిల్స్ ఉండాలనే నిబంధన ఉంది. ● లఘు చిత్రాలను ఏదైనా ఎలక్ట్రానిక్ పరికరం ద్వారా చిత్రీకరించవచ్చు. ● పోటీకి పంపేవి ఆగస్టు 9, 2016 తర్వాత చిత్రీకరించినవై ఉండాలి. ● దరఖాస్తులను ఆగస్టు 31 లోపు మైగవ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పంపాలి. ● చిత్రీకరించిన లఘు చిత్రాలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ● వెబ్‌సైట్‌లో లాగిన్ అయిన తరువాత యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వీడియో యూఆర్ఎల్, దరఖాస్తు, ధ్రువీకరణ పత్రం, లఘుచిత్రం సన్నివేశాలకు సంబంధించిన చిత్రాలను పంపాల్సి ఉంటుంది. ఇక లఘుచిత్రం నిడివి అయిదు నిమిషాల లోపు తీయాల్సి ఉంటుంది.

అద్వితీయం.. నృత్యాభినయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాష్ట్రాలు, మతాలు వేరైనా మనమంతా భారతీయులం, కళ నిత్యనూతనం. కళలకు ప్రాంతీయ భేదం లేదంటూ కథక్ కళాకారుడు, కూచిపూడి కళాకారిణి తాళ వాయిద్యాలతో భారతీయతను చాటి చెబుతూ తమ ప్రతిభతో మైమరిపించారు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన భారతీయ సంప్రదాయ కళలను ప్రోత్సహించేందుకు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన కళతోపాటు ఇతర కళలను మిళితం చేసి జుగల్‌బందీ పేరుతో హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కథక్ నృత్య కళాకారుడు సౌరభ్‌చౌహాన్ నాట్య ప్రదర్శనలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ధవళేశ్వరానికి చెందిన రాధాకృష్ణ సంగీత, నృత్యపాఠశాల విద్యార్థిని గోరుగంతు లక్ష్మీదీపికతో కలిసి ఆదివారం రాత్రి ఆనంకళాకేంద్రంలో జుగల్‌బందీ ప్రదర్శన చేశారు. ఆంధ్రాకు చెందిన కూచిపూడి నృత్యంతో లక్ష్మీదీపిక అభినయించగా కథక్‌తో సౌరభ్‌చౌహాన్ చేసిన అభినయం కళాత్మకంగా సాగింది. ఉత్తరాదికి చెందిన తబలా, దక్షిణాదికి చెందిన మృదంగం కలిపి భారతీయతను తెలియజేస్తూ వందేమాతర గీతానికి అభినయించి జుగల్‌బందీ నృత్యంతో అలరించారు. భారతీయులంతా ఒకటే అంటూ జాతీయ జెండా పట్టుకుని ప్రాంతీయ భేదాలు లేవనే సందేశాన్ని అందించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఆస్థాన శిల్పి రాజ్‌కుమార్ వుడయార్, శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత ఎ.ఎస్.ఎన్.మూర్తి జ్యోతిప్రకాశనంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు గోరుగంతు నారాయణ, నాట్యాచారిణి ఉమాజయశ్రీ పర్యవేక్షించిన కార్యక్రమానికి వ్యాఖ్యాతగా అడ్డాల నాగేశ్వరరావు వ్యవహరించారు. నగరంలోని పలువురు కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.



నృత్యప్రదర్శన చేస్తున్న లక్ష్మీదీపిక

ద్విచక్ర వాహన యాత్రికుడికి అభినందనలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: దేశంలోని వివిధ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థుల స్థితిగతులను పరిశీలించేందుకు అమలాపురానికి చెందిన ఆకొండి పవన్ పలు రాష్ట్రాల గుండా ద్విచక్ర వాహనంపై పర్యటన చేశారు. 14 రోజుల పాటు 3,400 కిలోమీటర్లు ప్రయాణించి వారణాసి చేరుకున్నారు. మొత్తంగా 63 విద్యాలయాలను సందర్శించారు. యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని ఆదివారం సాయంత్రం స్వగృహానికి చేరుకున్న సందర్భంగా పట్టణంలోని కామెడీక్లబ్ ప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంత సుదీర్ఘ యాత్ర ద్విచక్ర వాహనంపై చేసి విద్యాలయాలను సందర్శించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జనిపిరెడ్డి సురేష్, యల్లమిల్లి కొండ, జవ్వాది శ్రీనివాస్, అరిగెల నాగబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



యాత్ర చేసిన పవన్‌ను అభినందిస్తున్న చిత్రం